18.8.52

700033
ANDHRA STATE LIBRARY

VISALAANDHRA, VIJAYAWADA

రిజిష్టర్డు నెం. 6097 4 పేజీలు : ఒక అణా

విశాలాంధ్ర

సంపుటి 1 ★ విజయవాడ : సోమవారం ; ఆగస్టు 18, 1952 ★ సంచిక 57

"విశాలాంధ్ర" చందా వివరాలు

సంవత్సర చందా	రు. 24-0-0	3 మాసములకు	రు. 6-6-0
అర్థ ,, ,,	12-0-0	నెలసరి చందా	2-2-0
		విడి ప్రతి	0-1-0

ఆదివార సంచిక చందా వివరాలు

సంవత్సర చందా	రు. 6-0-0	అర్ధసంవత్సర చందా	రు. 3-8-0
	విడి ప్రతి	0-2-0.	

నైజాం పదవీ భ్రష్టత సమస్య

ఔరంగాబాద్ కాంగ్రెస్ కమిటీ తీర్మానం

ఔరంగాబాద్, ఆగస్టు 16

నైజాంను పదవీ భ్రష్టుని చేయాలని డిమాండు చేస్తూ, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిజామాబాద్ సమావేశంలో చేసిన తీర్మానాన్ని అమలు పరచవలసిందని కోరుతూ నిన్న ఇక్కడ జరిగిన సమావేశంలో ఔరంగాబాద్ జిల్లా కాంగ్రెసు కమిటీ తీర్మానించింది.

ఉస్మానియా యూనివర్సిటీని కేంద్రానికి స్వాధీనం చెయ్యాలనే సూచనను ఉపసంహరించుకోవలసిందిగా ఈ కమిటీ డిమాండు చేసింది.

'చైనాకు వ్యతిరేకమైన ఏ కూటమిలోను భారతదేశం చేరబోదు'

అమెరికాలో ఇండియా రాయబారి శ్రీ సేన్ ఉద్ఘాటన

పసిఫిక్ రక్షణసంధిపట్ల నెహ్రూప్రభుత్వ వైఖరి వివరణ

వాషింగ్టన్, ఆగస్టు 17

చైనా ప్రాతినిధ్యంలేని పసిఫిక్ రాజ్యాల సమావేశంలో భారతదేశం పాల్గొనదని, అమెరికాలో భారత రాయభారి శ్రీ బి. ఆర్. సేన్, నిన్న ఒక రేడియో ప్రసంగంలో స్పష్టం చేశాడు.

"ప్రాంతీయ సహకారము" మాత్రం మంచిదే. కాని చైనాలేని పసిఫిక్ రక్షణసంధి, ఒక కక్షికూటమిగా (బ్లాక్) పరిణమించక తప్పదు.

అట్టికూటమిలో చేరటం భారతదేశముయొక్క తటస్థవిధానానికి వ్యతిరేకం కనుక పసిఫిక్ రక్షణసమావేశంలో భారతదేశం పాల్గొనలేదు." అని శ్రీ సేన్ తెలియజేశాడు.

"ప్రపంచంలో ఏ మూల స్వాతంత్ర్యానికి భంగంకలిగినా 'భారతదేశం చూస్తూఊరుకోదు అని ప్రధాని నెహ్రూ భారతదేశ వైఖరిని ఏనాడో స్పష్టం చేశాడు. మిత్రరాజ్యసమితి ద్వారా పై ఆశయసాధనకు భారతదేశం కృషి చేస్తుంది" అని సేన్ అన్నాడు.

"ప్రజల జీవిత పరిమాణాన్ని వృద్ధి చేయుటం ఆసియాలో తక్షణ సమస్య. భారత ప్రజలు శాంతిని, సుఖజీవనాన్ని సుచేయాలని [illegible]న్నారు. యుద్ధమే [illegible] వస్తే, భారతదేశ పురోగమనం రెండు శతాబ్దాలు వెనుకకు పోతుంది. ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవటమే భారత ప్రభుత్వ విధానం మాకు దురాక్రమణ ధ్యేయములేదు. మా పొరుగు దేశాలు, మాపట్ల గౌరవంగా మర్యాదతో వ్యవహరిస్తున్నారు. అని శ్రీ సేన్ తన ప్రసంగం ముగించాడు.

జపాన్ వర్తకులకు చైనా ఆహ్వానం

టోకియో, ఆగస్టు 16

చైనా ప్రభుత్వం నిర్వహిస్తూన్న చైనా - అంతర్జాతీయ వ్యాపార ప్రవర్ధకసంఘంవారు జపాన్ వర్తకులకు తమ ప్రతినిధులను పంపవలసిందంటూ కబురు పంపారు.

జూన్ నెలలో జపాన్ అంతర్జాతీయ వ్యాపార ప్రవర్ధకసంఘంవారికీ చైనా అంతర్జాతీయ వ్యాపార ప్రవర్ధకసంఘం వారికీ మధ్య ఆరుకోట్ల పౌనుల వస్తువినిమయ ఒడంబడికపై సంతకాలు జరిగినాయి. ఆ ఒడంబడికను సత్వరం కార్యరూపంలోకి తేవడం కోసమై వెంటనే ప్రతినిధులను పంపవలసిందని చైనా వ్యాపార ప్రవర్ధకసంఘంవారు కబురు పంపారు.

కాని, చైనాకు వెళ్ళదలచిన జపాన్ వర్తకులకు పాస్‌పోర్టులివ్వకుండా జపాన్ విదేశాంగ కార్యాలయోద్యోగులు ఆటంకాలు కలిగిస్తూన్నారని పెకింగ్ రేడియో ప్రకటించింది.

మలయాలో బ్రిటిష్ సేనల హత్యాకాండ

సింగపూర్, ఆగస్టు 16

జోహోర్ రాష్ట్రంలో టెంగ్‌గాక్ ప్రాంతంలో నేటి మధ్యాహ్నం 1-30 గంటలవేళ బ్రిటిష్ దళాలు మలయన్ గెరిల్లాలను ఎదుర్కొని ఆరుగురిని చంపినట్లు ప్రకటించబడుతూంది. బ్రిటిషు సైనికుడు ఒక్కడే మరణించాడట. ఇద్దరు గెరిల్లాలు బ్రిటిష్ సైనికులచేత పట్టుబడ్డారట. వారిలో ఒకామె స్త్రీ.

మద్రాసు, ఆగస్టు 17

ఇండియా ఆర్థికమంత్రి శ్రీ చింతామణి దేశముఖ్ ఈవుదయం బొంబాయి నుండి విమానంలో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ 5 రోజులు వుంటారు.

'ఎయిర్ ఇండియా' ఉద్యోగుల తీసివేత

పోలీసులచే కంపెనీ కార్యాలయాల కాపలా

బొంబాయి, ఆగస్టు 17

'ఎయిర్ ఇండియా' విమానకంపెనీ చైర్మన్ శ్రీ టాటా యీరోజు ఒక ప్రకటనచేస్తూ దేశీయ, విదేశీ విమాన రాకపోకలను యీరోజు ఉదయం 12 గంటలనుండి ఆపుచేస్తున్నామని వెల్లడించారు.

ఈపరిస్థితిని చర్చించేందుకు యీరోజు సాయంత్రం వైమానికోద్యోగుల సంఘం సమావేశమైనది. కంపెనీ కార్యాలయాలను సాయుధ పోలీసులు కాపలాకాస్తున్నారు.

కంపెనీ నోటీసు

కంపెనీ కార్యాలయం ముందు మేనేజిమెంటు చేసిన ప్రకటన ఒకటి అంటించబడింది. అందులో యీ విధంగా ఆరోపించారు.

"ఇంజనీరింగ్ షాప్‌లో ఉద్యోగులు పనిగట్టుకొని, ఉద్దేశపూర్వకంగా పనిలో జాప్యం, సాచివేత విధానాలవలంబించడం, పనులు మానివేయడం జరుగుతోంది; అంచేత వీరిని తొలగించడానికి మేనేజిమెంటు నిశ్చయించింది. ఈనోటీసు బోర్డుపై ప్రకటించిన వారికి ఆగస్టు 17 నుండి జీతాలివ్వబడవు."

గూర్ఖా కేంద్రాల మూసివేత సమస్య

నెహ్రూ ఎట్టి ఉత్తర్వులు జారీ చేయలేదని గోపాలన్ వివరణ

(మా విలేఖరి)

మద్రాసు, ఆగస్టు 16

భారత భూభాగంలో బ్రిటిషు సేనలోకి గూర్ఖాలను రిక్రూట్ చేసే కేంద్రాలను మూసివేయడానికి నెహ్రూ ఎట్టిఉత్తర్వులూ జారీచేయలేదని ప్రజాప్రతినిధుల సభ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ ఏ. కె. గోపాలన్ నేడిక్కడ వారితో మాట్లాడుతూ తెలియజేశారు.

నెహ్రూ అలా ఉత్తర్వు లిచ్చినట్లు బ్లిట్జ్‌లో ప్రకటించబడిన వార్తపై శ్రీ గోపాలన్‌ను ప్రశ్నించగా ఆయన పైసమాధానమిచ్చారు.

సెకండరీ స్కూలు నిబంధనలు

నిరసనగా ఉపాధ్యాయుల - విద్యార్థుల ఐక్యప్రదర్శనం

కలకత్తా, ఆగస్టు 16

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ సెకండరీ స్కూలు నిబంధనలకు నిరసనగా యీరోజు నగరంలో వేలాది ఉపాధ్యాయులు - విద్యార్థులు ఐక్య ప్రదర్శనలు గావించారు.

పై నిబంధనలలో ఉపాధ్యాయులకు తక్కువ జీతాలుండడం, ప్రధానోపాధ్యాయుడు రహస్య నివేదిక నంపడం, విద్యార్థుల ప్రవర్తనపై అనవసర నిర్బంధాలుండడం - పై ప్రదర్శనలకు కారణ మయ్యింది.

సాయంత్రం వెల్లింగ్టన్ స్క్వేర్‌లో బ్రహ్మాండమైన సభ జరిగింది. పై ప్రభుత్వ నిబంధనలను విద్యాలసంస్థల అభిప్రాయానికి పంపాలని సభలో తీర్మానించారు.

అమ్మకంపన్ను బిల్లు అద్వితీయమైనదట

బొంబాయి ఆర్థికమంత్రి స్వోత్కర్ష

పూనా, ఆగస్టు 15

గత మూడు రోజులుగా బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో అమ్మకంపన్ను బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ రాష్ట్ర ఆర్థికమంత్రి "అమ్మకంపన్ను బిల్లు అద్వితీయ" మైనదన్నారు.

ధనిక, బీద తారతమ్యం లేకుండా యావత్ ప్రజానీకపు ప్రయోజనాలకీ బిల్లు ఎంతో లాభదాయకమని కూడా ఆయన అన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు: "ఇక మిగిలిందల్లా యీ బిల్లు విషయమై కేంద్రప్రభుత్వాన్ని, రిపబ్లిక్ అధ్యక్షుణ్ణీ ఒప్పించడం. పార్లమెంటు ఆమోదించిన అత్యవసర వస్తువుల బిల్లుకు యీ బిల్లు ఏవిధంగానూ వ్యతిరేకంగాదని వారికి రాష్ట్రప్రభుత్వం నచ్చచెప్పాల్సి వుంది!"

స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెసేతర పక్షాల ఐక్యత

అవసరమని తమిళనాడు ప్రజాపార్టీ తీర్మానం

[మా విలేఖరి]

మద్రాసు ఆగస్టు 16,

మద్రాసు కార్పొరేషను ఎన్నికలలో పోటీచేయడానికి యేర్పడిన పౌర సంయుక్త సంఘటన (సిటిజన్సు జాయింట్ ఫ్రంట్) నిర్మాణాన్ని బలపరుస్తూ, కాంగ్రెసు వ్యతిరేక పక్షాల మధ్య పోటీలుండగూడదని నేటి ఉదయము మద్రాసులో సమావేశమైన తమిళనాడు ప్రజాపార్టీ కార్యవర్గ సమావేశం తీర్మానాలు చేసింది. ఈ సమావేశానికి ప్రజాపార్టీ శాసనసభ్యులు కూడ హాజరయ్యారు శ్రీ యస్. బి ఆదిత్యన్ అధ్యక్షత వహించారు.

సోషలిస్టుపార్టీ - ప్రజాపార్టీల కలయికపై తమిళనాడు ప్రజాపార్టీ అభిప్రాయం తెలుపవలసిందని కేంద్ర ప్రజాపార్టీ నాయకులు కోరగా తామా విషయాన్ని యీ సమావేశంలో చర్చించామని ఒక తమిళనాడు ప్రజాపార్టీ శాసన సభ్యుడు చెప్పారు.

సోషలిస్టుపార్టీకి పిలుపు

సోషలిస్టుపార్టీ వారిని పౌర సంయుక్త సంఘటనలో చేరి కాంగ్రెసు వ్యతిరేక శక్తుల మధ్య పోటీలు లేకుండా చేయాలని విజ్ఞప్తిచేస్తూ ఒక తీర్మానం ఆమోదించబడింది. ఈ తీర్మానానికి ఒక్క ఎ. ఆర్. వి. ఆచార్ గారు (మద్రాస్ స్టేటు ప్రజాపార్టీ కార్యదర్శిమాత్రమే వ్యతిరేకంగా ఓటు చేశారు. తాను సోషలిస్టు-ప్రజాపార్టీలకలయికకు,యిష్టుడననీ,సంఘటన ఆ కలయికను అంగీకరించడంలేదనీ, కనుకనే తాను తీర్మానానికి వ్యతిరేకంగా ఓటుచేశాననీ ఆయన విశాలాంధ్ర విలేఖరితో చెప్పారు. సోషలిస్టులు కనుక ఐక్య సంఘటన సహకరించితే సోషలిస్టులకు కొన్ని నియోజకవర్గాలను పోటీలేకుండా ప్రత్యేకంగా వదలివేయు దానికి అభ్యంతరంలేదని ఐక్యసంఘటనవారు సోషలిస్టులకు తెలియజేసినట్లు ప్రజాపార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. అయినా సోషలిస్టులు కాంగ్రెసు వ్యతిరేక ఐక్యసంఘటనతో కలవ నిరాకరిస్తున్నారట. కాంగ్రెసు వ్యతిరేకశక్తుల ఐక్యతను బలహీనపరచే సోషలిస్టునాయకుల వైఖరి యిక్కడి రాజకీయవర్గాలవారికి అసంతృప్తికరంగా వుంది. స్థానిక సోషలిస్టు నాయకులు సంఘటనలో చేరడానికి సుముఖంగానే వున్నప్పటికీ, కేంద్ర సోషలిస్టు నాయకత్వం తాఖీదులవల్ల వారు ఎన్నికలలో ఐక్యసంఘటనతో సహకరించ నిరాకరించుతున్నారని తెలుస్తున్నది.

కొత్తపన్నులకు నిరసన

దేశ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మద్రాసు ప్రభుత్వం వేయదలచిన కొత్త పన్నులు ప్రజలపై అత్యంతభారాన్ని మోపుతున్నాయని ప్రతి గ్రామంలోను, పట్టణంలోను సభలు జరిపి కొత్త పన్నులకు వ్యతిరేకంగా ఆందోళన జరపవలసిందిగ ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ తమిళనాడు ప్రజాపార్టీ శాసనసభ్యులు, కార్యవర్గం సంయుక్తసమావేశంలో మరో తీర్మానం ఆమోదించింది.

రేపు తమిళనాడు ప్రజాపార్టీ కార్యవర్గం తిరిగి సమావేశమౌతుంది.

కృషిక్ లోక్ పార్టీకి రెండు మంత్రి పదవులు?

విశాఖజిల్లా నాయకుల అసంతృప్తి

(మా రాజకీయ విలేఖరి)

మద్రాసు, ఆగస్టు 15

మద్రాసులో కాంగ్రెసు ప్రభుత్వపు అస్థిరపు బ్రతుకును ఉపయోగించుకొని ప్రొఫెసరు రంగాగారి పార్టీ యిన్నాళ్ళనుంచీ ఆడుతూన్న బేరాలు ఫలవంతమైనట్లే నమ్మకంగా తెలుస్తూంది.

కృషికార్‌లోక్‌పార్టీకి మద్రాసు మంత్రివర్గంలో రెండు స్థానాలను ఇవ్వడానికి నిశ్చయం అయిందట. మంత్రులు కాగలవారి పేర్లుగా వెలగపూడి రామకృష్ణ, తిమ్మారెడ్డిగార్ల పేర్లు వచ్చాయి. రామకృష్ణగారికి పబ్లిక్ వర్క్సు శాఖనూ, తిమ్మారెడ్డిగారికి స్థానిక స్వపరిపాలనాశాఖనూ సిద్ధంచేస్తున్నారట.

బడ్జెట్ సమావేశపు ఫలితాలను బేరీజు వేసుకొని ప్రధానమంత్రి శ్రీ రాజగోపాలచారి కాంగ్రెసు మంత్రివర్గపు నిలకడగురించి భయంపొందుతున్నాడు. డెమాక్రటిక్ ఫ్రంట్ ఆయన అనుకొన్నట్లుగా విచ్ఛిన్నం కాలేదు. కంట్రోలు రేషనింగ్‌ల రద్దువలన ఆయన అనుకొన్నట్లుగా ప్రజానీకం కాంగ్రెసు ప్రభుత్వంవేపు చేతులు చాచుకొని రాలేదు. పైగా తిండిగింజల ధరలు రెట్టింపు అయిపోయి వేలసంఖ్యలో ఆకలియాత్రలు సాగిస్తున్నారు. నాయకత్వం నిజంగా ప్రజానాయకుల చేతులలోకి పోతూంది. పైగా తన ప్రభుత్వం తలపెట్టిన పన్నులకు వ్యతిరేకంగా దేశంలో పెద్ద ఆందోళన రేగుతూంది.

ఈ దశలో శ్రీ రాజగోపాలాచారి కంగారు పడుతూన్నాడంటే ఆశ్చర్యం లేదు. మిశ్రమ మంత్రివర్గ స్థాపనకు ఆమోదించకపోతే ఈ భారం మోయడం తన తరం కాదనికూడా ఆయన ప్రధాని నెహ్రూకు వ్రాశారట. దానికి ఫలితమే కె.ఎల్. పి కి మంత్రివర్గంలో రెండు స్థానాలు.

కాని, ఈ కొత్త మార్పులవలన ఏర్పడబోయే మంత్రివర్గంకూడా స్థిరంగా వుంటుందనే ఆశలు కనబడడంలేదు. కె. ఎల్. పి రెండు మంత్రి స్థానాలను కోరడం కొత్త వార్తకాదు. శ్రీ రాజాజీకూడా దానికి సమ్మతించాడనీ, ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి దానికి అడ్డుపడి వుండకుంటే ఈ మార్పులేవో ఇది వరకే జరిగి వుండేవనీ ఇంతకు పూర్వమే విన్నాం. ఇప్పుడుకూడ శ్రీ సంజీవరెడ్డి ఈ పథకానికి ఆమోదించలేదనీ, ఆయన అభ్యంతరాలను ప్రక్కకు నెట్టివేసి నెహ్రూ రాజాజీకి '[illegible]' ఇచ్చారనీ వింటున్నాం. ఇది ఆంధ్ర కాంగ్రెసు నాయకులలో చాల ఆందోళన కలిగిస్తూందికూడా.

లోక్‌పార్టీలో ముసలం

రెండు మంత్రి పదవులు వచ్చినా కె. ఎల్. పి నాయకవర్గాలలో సంతృప్తి కలిగించలేదు. 12 వ తేదీన గుంటూరులో జరిగిన కె. ఎల్. పి. సమావేశంలో (రహస్య) ఈ మంత్రి స్థానాలను రంగాగారు ప్రకటించినప్పుడు విశాఖపట్టణం వారు చాల మౌనంగా స్వీకరించారు. కె. ఎల్. పి. సభ్యులు అధికంగావున్న విశాఖపట్టణం శ్రీకాకుళం జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం లేకపోయినందుకు వారు కిటకిట పడుతున్నారు.

(8వ కాలం తరువాయి)

పశ్చిమ బెంగాలులో ఎక్కువగా పట్టభద్ర నిరుద్యోగులూ, మద్రాసులో ఎక్కువగా మెట్రిక్యులేట్ నిరుద్యోగులూ వున్నారని రిపోర్టులో తెలియజేయబడింది.

పసిఫిక్‌లో బ్రిటిష్ పలుకుబడికి స్వస్తి

అమెరికా ఎత్తుల్లోని అంతరార్థం

పెకింగు పత్రిక వ్యాఖ్య

పెకింగ్, ఆగస్టు 16

జపాన్‌లో సైనిక స్థావరాలను అమెరికాకు యిస్తూ జూలై నెలలో యోషీడా ప్రభుత్వం అమెరికాల మధ్య సంధిజరిగింది. మరల ఆగస్టులో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికాల మధ్య సమావేశంజరిగింది. ఇవన్నీ పసిఫిక్‌లో అమెరికా తన దురాక్రమణ నీతిని తీవ్రతరం చేయడానికి సూచనలని పెకింగ్ పీపుల్సు డైలీ వ్యాఖ్యానించింది.

అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలమధ్య 'రక్షణసంధి' పేరుతో దురాక్రమణ పద్ధతులను గట్టిపరచుకొనేటందుకే అమెరికా హానొలూలూ సమావేశాన్ని ఏర్పరచింది.

ఈ 'రక్షణ సంధి'ని జపాన్ అమెరికాల మధ్యజరిగిన "రక్షణ ఒడంబడిక"తోనూ, అమెరికా-ఫిలిప్పైన్స్‌ల మధ్య జరిగిన "పరస్పర సహాయసంధి"తోనూ జతపరచి 'ఉత్తర అట్లాంటిక్ ఒడంబడి' మాదిరిగానే "పసిఫిక్ సంధి" ని నిర్మించాలని వారిఎత్తు.

ఈ ఎత్తుకు ఎన్నో ఆటంకాలు వచ్చాయి అసలు అమెరికాతో సైనిక సంధులు చేసుకొన్న దేశాలలోని ప్రజలకే శాంతిభంగకరములయిన ఆ ఒడంబడికల ఎడ తీవ్ర వ్యతిరేకతవుంది. అమెరికా 'రక్షణ'యనీ, 'ఆత్మరక్షణ'యనీ, ఎంత సతమతం అయి అసలు ఉద్దేశాన్ని దాచిపెట్టబోయినా, ఆసంధుల అసలు నైజాన్ని ఆదేశాల ప్రజలు ఎరుగుదురు.

రెండోది : ప్రధానములయిన ఇండియా, బర్మా, ఇండోనీషియా వంటి దేశాలు దురాక్రమణకే వుద్దేశించబడిన "పసిఫిక్ సంధి"లో చేరడానికి నిరాకరించాయి. "వాటిని మినహాయిస్తే పసిఫిక్ సంధిలో పేరుకు గొప్పదనం తప్ప విలువ ఏమీలేదు"ని లండన్ టైమ్సు వ్రాసింది.

మూడోది : జపానును ఈ 'పసిఫిక్ సంధి'లోకి అమెరికా ప్రవేశపెట్టి తీరుతుంది. ఏమంటే నేడు అమెరికాకు దూరప్రాచ్యంలో ప్రధానమైన సైనిక స్కంధావారం జపానే. అక్కడినుంచే కేంద్రం చేసుకొని అమెరికా తన దురాక్రమణలను సాగించాలని చూస్తూంది. కాని, దీనివలన ఇదివరకు జపాన్ ఆక్రమణకు గురియై బాధపడిన దేశాలకు, ముఖ్యంగా ఆస్ట్రేలియాకు అదురు కలుగుతూంది. ఇది హానొలూలూ సమావేశంలోనే బయటపడింది. ఎ. ఎఫ్. పి. వార్తాసంస్థ కథనం అనుసరించి ఆ సమావేశంలో ఆస్ట్రేలియా అమెరికా వొత్తిడికి లొంగి జపాన్ పునరాయుధధారణ సమస్యకు ఆమోదం తెలిపిందనీ, అయినా "చాలా జాగ్రత్తగా వ్యవహరించ వలసిందిగా అమెరికనులను కోరడం" మానలేదనీ తెలుస్తూంది.

అమెరికా ఎత్తులు

ఈ పసిఫిక్‌లో దురాక్రమణ కొరకుద్దేశించబడిన సంస్థను నిర్మించడంలో అమెరికా బ్రిటనును పూర్తిగా ప్రక్కకు నెట్టివేసింది. పసిఫిక్, దూరప్రాచ్యాలనుంచి బ్రిటిష్ పలుకుబడిని పూర్తిగా నిర్మూలించాలని అమెరికా ఎత్తు. నిజానికి యీ మూడురాజ్యాల రక్షణసంధిలో దూరప్రాచ్యములోని బ్రిటిషు అధినివేశాలలో హెచ్చుభాగం బ్రిటిషు పలుకుబడికి దూరం అవుతూంది. అమెరికా అధీనంలోకి చేరుతూంది. 'పసిఫిక్‌సంధి'కి ఏర్పాట్లు చేయడంలో అమెరికా తనకూ బ్రిటనుకూ మధ్య పసిఫిక్ ప్రాంతంలో వైరుధ్యాలను తీవ్రతరం చేసుకొంది.

చైనాప్రజలూ, ఆశియాదేశాల, పసిఫిక్ ప్రాంతాల ప్రజలూ అమెరికనుల యుద్ధప్రయత్నాలను ఒకకంట కనిపెట్టి వున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండు, అమెరికాలుచేసుకొన్న 'రక్షణసంధి'నిగాని, మరే ఇతర యుద్ధసంఘలనుగాని వారు సహించరు. ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాలలో శాంతి ఉద్యమం బలపడుతూంది అమెరికా ఎత్తులు సాగవు. ఆసియా, పసిఫిక్ ప్రాంతప్రజలు తమ శాంతిపోరాటంలో విజయం పొందితీరుతారు.

[నవచైనా వార్తాసంస్థ]

అమెరికా-ఆఫ్ఘన్ ప్రభుత్వాల రహస్యసంధి

సైనిక స్థావరాల నిర్మాణానికి సన్నాహాలు

[మా విలేఖరి]

న్యూఢిల్లీ, ఆగస్టు 16

అమెరికా, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య రహస్య సంధి జరిగినట్లు రూఢిగా తెలుస్తున్నది. పెద్దఎత్తున సైనికకేంద్రాలను ఆఫ్ఘనిస్థాన్‌లో నిర్మించుకోడానికి అమెరికా పూనుకున్నది. అంతర్జాతీయ పరిస్థితి విషమించిన పక్షంలో అమెరికా తన ఇష్టము వచ్చినట్లు వ్యవహరించవచ్చునని కూడా ఆఫ్ఘన్ ప్రభుత్వం అంగీకరించింది.

అమెరికా ఎగుమతి - దిగుమతి బ్యాంకుకు సంబంధించిన ఒక నిపుణుడు ముల్లర్ అను ఒక ఇంజనీరు ఈ సందర్భంలో ఆఫ్ఘనిస్థాన్ పర్యటించినట్లు ఢిల్లీ టైమ్సు అను వారపత్రిక 10 వ తేదీన ప్రకటించింది. రాజధాని నగరమైన కాబూల్‌ను, వివిధ రాష్ట్రనగరాలతో కలిపే [illegible] రైలులు నిర్మించటానికి అమెరికన్లు ప్రయత్నిస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టు, మారిసన్ నడ్సన్ అను అమెరికా కంపెనీకి ఇవ్వబడ్డది. వైమానిక కేంద్రాలు,గిడ్డంగులు, సైనికబారక్సు నిర్మించే విషయమై అమెరికా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరి మార్చి నెలలలో కాబూల్‌లో అమెరికా రాయబారి కార్యాలయపు సైనిక సలహాదారు కల్నల్ వాటిసన్, ఆఫ్ఘనిస్థాన్, పశ్చిమ, ఉత్తరప్రాంతాలలో పర్యటించి, వైమానిక కేంద్రాలుగా వుపయోగపడే స్థావరాలను పరిశీలించాడు.

తన పర్యటనపై వాటిసన్ అమెరికాకు రిపోర్టు పంపుతూ మజారీ-షరీఫ్ అను ప్రాంతంలో, పెద్ద విమానకేంద్రం కట్టాలని సూచించాడు.

పై నిర్మాణాలకయ్యే ఖర్చు అంతా, అమెరికా ఎగుమతి, దిగుమతి బ్యాంకు, అప్పుగా ఇవ్వటానికి అంగీకరించింది.

శ్రీ గోపాలన్ చైనా పయనం

పెకింగ్ శాంతిమహాసభలో పాల్గొనే నిమిత్తం

మద్రాసు, ఆగస్టు 16

పెకింగ్ శాంతిమహాసభలో పాల్గొనే నిమిత్తం కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ సెప్టెంబరు 15వ తేదీన బయలుదేరి పెకింగ్ వెళ్ళుతున్నారు. ఆయనకు పాస్‌పోర్టు యివ్వబడింది. చైనా సోవియట్ యూనియన్‌లలో పర్యటించుతానని కూడ శ్రీ గోపాలన్ తెలియజేశారు.

(మా. వి.)

మెట్రిక్యులేట్లలో నిరుద్యోగ సమస్య

చాల తీవ్రంగా వుందట

న్యూఢిల్లీ, ఆగస్టు 16

నిరుద్యోగులుగా వున్న మెట్రిక్యులేట్ల సమస్య తీవ్రంగా వుందని దేశంలోని ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీల వారు ఒక విచారణ జరిపి ప్రకటించిన రిపోర్టు తెలియజేస్తోంది. అందుచేత ప్రభుత్వంలో, పరిశ్రమలలో అవకాశాలు ఎక్కువచేయడం, వీరికి టెక్నికల్ శిక్షణ ఇవ్వడం ఉత్తమమని రిపోర్టు సూచిస్తోంది.

మే 1952 వరకు ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలలో రిజిష్టరు చేయబడ్డ 38,26,595 మంది నిరుద్యోగులలో 14,838 మంది పట్టభద్రులు, 101,088 మంది మెట్రిక్యులేట్లు వున్నారట.

(మిగతా 5వ కాలంలో)

హైద్రాబాద్ విభజన

డిమాండు న్యాయసమ్మతమని స్వామి రామానందతీర్థ పునరుద్ఘాటన

బొంబాయి, ఆగస్టు 16

"భాషా ప్రయుక్తంగా హైదరాబాదు సంస్థానాన్ని విభజించాలన్న డిమాండు సహజమూ, న్యాయసమ్మతమూ అయినటువంటిది" అని నేడిక్కడ గిర్గాం జిల్లాకాంగ్రెస్ [illegible] సభలో అధ్యక్షోపన్యాసమిస్తూ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకుడు స్వామి రామానంద తీర్థ ప్రకటించారు. భాషా ప్రయుక్త విభజన కోరుతున్నంత మాత్రంచేత దేశ ఐక్యతకు హైదరాబాద్ ప్రజలు భంగం కలిగించ దలచినట్టు భావించరాదని స్వామిజీ అన్నారు ఈ విభజన సమస్య దక్షిణ భారతానికి మాత్రమే కాక మొత్తం జాతికే సంబంధించినదని ఆయన వివరించారు.

కాశ్మీర్‌లోవలె హైదరాబాద్‌లో కూడా వంశపారంపర్య రాజరికాన్ని రద్దుచేయాలన్న డిమాండును ప్రస్తావించి స్వామి రామానంద ఇలా అన్నారు.

"నైజాంను పదవీభ్రష్టున్ని చేయాలన్న నినాదం నేనిప్పుడు తీసుకోవడంలేదు. రాజప్రముఖుల వ్యవస్థనే రద్దు చేయాలని కోరతాను."

కాంగ్రెసు కార్యకలాపాలనుగూర్చి ప్రస్తావిస్తూ, పార్లమెంటరీ శాఖకు ఆర్గనైజేషనల్ శాఖకు మధ్య యింకా ఎక్కువ సమన్వయం వుండాలని స్వామిజీ అన్నారు. దేశంలో భూములను న్యాయసమ్మతంగా పునర్విభజించాలన్నారు. హైదరాబాద్ అసెంబ్లీలో త్వరలో భూసంస్కరణలపై ఒకబిల్లు ప్రవేశపెట్టబడుతుందన్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశముఖ్ మాట్లాడుతూ, ప్లానింగ్ కమిషన్ రిపోర్టు రెండు నెలలలో వెలువడుతుందన్నారు. పంచవర్ష ప్రణాళిక నిర్వహణకు ధనంకంటె, ప్రజలశ్రమ, సహకారం ఎక్కువ అవసరమన్నారు.

ముద్దుకూరి చంద్రశేఖరరావు
[అధ్యక్షుడు]
కంభంపాటి సత్యనారాయణ
కాట్రగడ్డ రాజగోపాలరావు

“భావప్రకటనా స్వాతంత్ర్యం మన జన్మహక్కు. దానికి రాజ్యాంగం సంపూర్ణంగా అభయ మిచ్చే వరకు విశ్రమించము.”

విశాలాంధ్ర
18-8-52 సోమవారం

భాషా రాష్ట్రాలు

మధ్యరాష్ట్రానికి చెందిన అమరావతి పట్టణంలో అఖిల భారత భాషాప్రయుక్త రాష్ట్ర మహాసభ శ్రీ లంక సుందరం గారి అధ్యక్షతను జరుగుతోంది. అచటనే సంయుక్త మహారాష్ట్ర మహాసభ శ్రీ వి. డి. దేశపాండేగారి అధ్యక్షతను సమావేశమయింది. భాషా రాష్ట్ర నిర్మాణోద్యమం యింతవరకూ బలహీనంగావున్న మహారాష్ట్ర దేశంలో రెండు సభలూ జరుగుతున్నాయంటే భాషారాష్ట్ర సమస్య నానాటికీ ఎలా తీవ్రమవుతూందో ద్యోతకమవుతుంది.

లంక సుందరంగారు తమ అధ్యక్షోపన్యాసంలో ‘భారత రాజ్యాంగం మూడవ సూత్రం ప్రకారం’ ప్రస్తుత రాష్ట్ర సరిహద్దులనుమార్చి భాషారాష్ట్రాలను నిర్మించవచ్చునని స్పష్టపరచారు. కాని భాషారాష్ట్రాలను ఏర్పరిస్తే ‘కాంగ్రెసు మంత్రివర్గాలు కొన్ని బోల్తా కొడతాయని’ “అధికార మదాంధులైన రాజకీయవేత్తలు” న్యాయమైన యీ ప్రజావాంఛను నిరాకరించుతున్నారని చెప్పారు.

సంయుక్త మహారాష్ట్ర సమావేశానికి అధ్యక్షత వహించిన దేశపాండేగారు అన్నట్లుగా దక్షిణ భారతంలో భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి పెద్ద ఆటంకంగా హైదరాబాద్ సంస్థానం తయారయింది. దీనిని రద్దుచేస్తే తెలుగు, మహారాష్ట్ర కన్నడ ప్రజలు తమ తమ జాతీయైక్యతను సాధించడం సులభమవుతుంది.

ఐతే యీ సందర్భంలో ఒక సత్యాన్ని గుర్తుంచుకోవాలి. శ్రీ రామారావ్ దేశముఖ్‌గారన్నట్లుగా “ఆంధ్ర రాష్ట్రం ముందుగా ఏర్పడే అవకాశాలున్నాయి; దానిని సాధించాక భాషా రాష్ట్రాల నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరు.”

అందుచేత భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచాలని కోరే వారందరూ వివిధజాతుల ప్రజలను సమీకరించడానికి, ఆయా ప్రజల జాతీయ వాంఛలను స్పష్టీకరించడానికి తక్షణం పూనుకోవాలి; దానితోపాటు నెహ్రూ ప్రభుత్వంకూడ సుముఖత తెల్పుతున్న ఆంధ్ర రాష్ట్రాన్ని వివాదాలు లేని ప్రాంతాలతో, వెంటనే ఏర్పరచాలని కోరాలి.

లంక సుందరంగారు తమ ఉపన్యాసంలో మద్రాసు, బొంబాయి, హైద్రాబాద్ వగైరా నగరాలను కేంద్ర ప్రభుత్వ అధీనంలో వుంచాలని సూచించారు. చుట్టూ వున్న ప్రాంతాలనుండి నగరాలను వేరుపరచి కేంద్ర ప్రభుత్వం క్రింద వుంచడం భాషా రాష్ట్ర సూత్రానికే విరుద్ధమైనది. ఉదాహరణకు హైద్రాబాద్ నగరం తెలుగుదేశంలో వుంది. దీనిని కేంద్ర ప్రభుత్వ స్వాధీనం చేయడానికి ఆంధ్రులెవరూ అంగీకరించరు. మదరాసునగరం తమిళులకు పోతుందేమోనని భీతితో హైద్రాబాద్‌ను కేంద్రానికి ధారాదత్తం చేయాలనడంఅలాగే బొంబాయి కలకత్తా వగైరా ముఖ్యనగరాలన్నిటిని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలనడం సబబు కాదు.

హైద్రాబాద్‌ను తమ ముఖ్యనగరంగా ఆంధ్రులు ఎలా అభిమానించుతున్నారో అలాగే మహారాష్ట్రులు బొంబాయిని కోరుతున్నారు. మద్రాసు నగరంలాంటిదాని విషయంలో ఏమైనా విభేదాలుంటే వాటిని ప్రజాభిప్రాయం (ప్లెబిస్సైటు) తీసికోడం ద్వారా పరిష్కరించుకోవాలిసి వుంటుంది. అంతేగాని ముఖ్యనగరాలన్నిటినీ కేంద్ర ప్రభుత్వ స్వాధీనంలో వుంచాలనడం ఆయా ప్రజల స్వయంనిర్ణయ హక్కును తృణీకరించడమే అవుతుంది. కాబట్టి లంక సుందరంగారు పునరాలోచించాలని కోరుతున్నాము.

అమరావతిమహాసభ భాషాప్రయుక్త రాష్ట్రాలవుద్యమానికి నూతన రూపమిస్తుందని ఆశించుతున్నాము. మహారాష్ట్ర, కన్నడ, కేరళ సోదరులు తమ జాతీయవాంఛల కొరకు మహోద్యమాలను నిర్మించుతారని ఆశించుతున్నాము. సోదర ప్రజలు తమ జాతీయాభివృద్ధికి సాగించే పోరాటంలో తోడ్పడటానికి ముక్కోటి ఆంధ్రులు ఎల్లప్పుడూ సంసిద్ధమేనని విన్నవించుతున్నాము.

బియ్యం మినహా అన్నీ సమృద్ధే!

హైదరాబాద్ ఆహార పరిస్థితిపై ముఖ్య మంత్రి వివరణ

హైద్రాబాదు, ఆగస్టు 15

“గత ఆరు నెలల్లోను రాష్ట్రంలోని ఆహార పరిస్థితి ఆశాజనకంగా వుంది. వచ్చే 6 మాసాల్లోనూ పరిస్థితి మరింత మెరుగవుతుందని నా ఆశ. బియ్యం విషయం మినహా మిగతా ఆహార పదార్థాలన్నీ సమృద్ధిగా మనకు లభిస్తాయనే నా ఆశ” అని హైద్రాబాదు ముఖ్య మంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు నేడు రేడియోలో ప్రసంగిస్తూ అన్నారు:

రాష్ట్రంలో చెరువుల మరమ్మతుకోసం 1 కోటి, 18 లక్షల రూపాయలు వెచ్చించడానికి భారత ప్రభుత్వం అంగీకరించిందని శ్రీ రావుగారు వెల్లడించారు.

ప్రభుత్వం తయారుచేసిన పంచవర్ష ప్రణాళికలో మొత్తం రూ॥ 41 కోట్లలోనూ రు. 27 కోట్లు హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులకు ప్రత్యేకించడం జరిగినప్పటికి ఆర్థిక పరిస్థితులదృష్ట్యా ఏమీ అమలుజరుప సాధ్యం కాలేదని ఆయన అన్నారు. హైద్రాబాదు సముంజసమైన కోర్కెలు ఆలోచించి, కేంద్రప్రభుత్వం, ఫైనాన్సు కమీషన్‌లు ఇతోధిక సహాయం అందచేస్తారని ఆశిస్తున్నానని శ్రీ రావుగారన్నారు.

భూసంస్కరణలు

భూసంస్కరణల విషయం ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి యిలా అన్నారు. ప్రస్తుత టెనెన్సీ చట్టం, వ్యవసాయ భూముల వర్గాలతోపాటు, శాసనసభ వచ్చే సమావేశంలో మరింత హేతుబద్ధమైన భూసంస్కరణ చేసేందుకుగాను ప్రభుత్వం ఒకబిల్లు ప్రవేశపెట్టుతుంది. అప్పుడు ఒక్కొక్కవ్యక్తి ఎంతభూమి వుంచుకోవచ్చో నిర్ణయించబడుతుంది. భూమిపై దున్నేవారికి హక్కులభించుతుంది.

రాష్ట్రంలో గత 10 నెలలుగా, ఒకటి రెండు సంఘటనలు మినహా, ఎలాంటి దౌర్జన్య చర్యలు జరగలేదనీ, దీనికి ప్రభుత్వము తీసికున్న కఠినచర్యలే కారణమని శ్రీరావుగారన్నారు.

నానాటికీ విషమిస్తున్న ఆహార సమస్య

పరిష్కార మార్గం చూపాలని ప్రజాప్రతినిధుల రాయబారాలు

పెద్దాపురం, ఆగస్టు 19

పెద్దాపురం పట్టణ కమ్యూనిస్టు సోషలిస్టుపార్టీల ఆధ్వర్యాన 14-8-52న పెద్దాపురం పట్టణంలో నడుపబడిన ఆకలియాత్రలో 1000 మంది వివిధ వర్గాలకు చెందిన ప్రజాసామాన్యం పాల్గొని ఊరేగింపుగా డిప్యూటీ కలెక్టరుఆఫీసుకు, అక్కడనుండి డిప్యూటీ కలెక్టరు యింటికి వెళ్ళి తమ మెమోరాండం సమర్పించిరి. ఆ మెమోరాండంలో వివిధవృత్తుల ప్రజాసామాన్యం ఒకవైపున నిరుద్యోగబాధతో కుమిలిపోతూవుండగా రెండోవైపున కంట్రోల్సు తొలగించగానే - మాస్తూ వుండగానే ధాన్యంబస్తా 16/-నుంచి 31/- కుంచం బియ్యం 1-9-0 నుంచి 2-12-0 వరకూ దాదాపు రెట్టింపు పెరిగిపోయి ఏరకంగా ఆకలి మంటలకు గురియగుతున్నదీ వివరించారు. ప్రజా అవసరాలదృష్ట్యా మెమోరాండంలో ఈ దిగువకోర్కెలు తెల్పబడెను.

ప్రతివార్డుకొక్కొక్క చౌక బియ్యండిపో, డిపోలో తగినన్ని పరిశుభ్రమైన బియ్యంసప్లయి- గ్రామాలలో తగినంత స్టాకుతో శుభ్రమైనబియ్యంతో చౌకడిపోలు - సట్టావ్యాపారంచేసి కృత్రిమ క్షామం సృష్టించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే డీలర్లపై కఠినచర్యలు ఎప్పటికప్పుడు స్టాక్ తనిఖీ చేస్తూ మోసం జరగకుండా చూడటం. మొదలగు కోర్కెలు కోరారు.

పైకోర్కెలకు సమాధానం చెప్తూ డిప్యూటీకలెక్టరు ఇలా అన్నారు. “జోనల్ విభజనలో కృష్ణా, పశ్చిమగోదావరిజిల్లాలు మద్రాసుకు కలపడంతో ధాన్యమంతా మద్రాసుకు దారుణంగా ఎగుమతి అయిపోవడంతో ధరలు పెరిగిపోయాయి. దాని తాకిడి మన జిల్లాకు కట్టిగానే తగిలింది. ఆకలియాత్ర ప్రతినిధులు సూచించే ప్రజోపయోగ కేంద్రాల్లోనే చౌకడిపోలు స్థాపిస్తాం. ఎవ్వరు యెవరువచ్చి సూచనలు యిచ్చినా తీసుకుంటాం. పరిశుభ్రమైన బియ్యమే ఇచ్చి వ్యాపారంలో మోసం జరక్కుండా చూస్తాం”

రాత్రి 9 గంటలకు కామ్రేడ్ సారథి అధ్యక్షతక్రింద జరిగిన బహిరంగ సభలో ఆహారసమస్య - ప్రమాదకర ప్రభుత్వ విధానంగూర్చి కమ్యూనిస్టులు, సోషలిస్టులు వివరించారు.

(మా. వి.)

ముమ్మిడివరంలో 1500 మంది ఆకలియాత్ర

ముమ్మిడివరం, ఆగస్టు 18

ముమ్మిడివరం సబ్‌తాలూకాలోని వివిధ గ్రామాల ప్రజలు 1500 మంది ‘చౌకడిపోలు పెట్టాలి’ ‘ధాన్యపు రవాణాలాపాలి’ మొదలైన నినాదాలిచ్చుకుంటూ బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపారు.

తరువాత ముమ్మిడివరం తహసీల్దారును కలుసుకొని వివిధ గ్రామాల తరపున మెమొరాండం యిచ్చారు. ధాన్యం ధరలు విపరీతంగా పెరిగి పేదలు - మధ్య తరగతి ప్రజాసామాన్యం బియ్యం కొనలేక పస్తులుండ వలసిన పరిస్థితు లేర్పడ్డాయనీ; చౌకడిపోలు వెంటనే అన్ని గ్రామాల్లోను ఏర్పాటు చేయాలనీ, ధాన్యపు ఎగుమతులనుఆపుచేయించాలనీ మెమొరాండంలో కోరారు.

“అవసరమని తోచిన ప్రాంతాల్లో చౌకడిపోలు ఏర్పాటు చేస్తాము కాని మీరు చెప్పినట్లు మాత్రం చేయము” అని తహసీల్దారు సమాధానం చెప్పాడు.

తరువాత జరిగిన బహిరంగసభకు శ్రీ గుత్తుల నారాయణదాసుగారు అధ్యక్షత వహించారు. శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణగారు ప్రస్తుత ఆహారసమస్యను గురించి మాట్లాడారు.

నాగాయిలంక కూలీల అగచాట్లు

నాగాయిలంక, ఆగస్టు 14

నాగాయిలంక పరిసర ప్రాంతాల్లో బియ్యంబస్తా రు 35-0-0 ల వరకు అమ్ముతున్నారు. సేరు బియ్యం కొనాలంటే 0-18-0 లకు కూడా దొరుకుట లేదు యీ ప్రాంతాల్లో అధిక సంఖ్యాకులుగానున్న వ్యవసాయ కూలీలు బియ్యం కొనలేక-దొరకక పస్తులుంటున్నారు.

సంగెగడ్డ- నాగాయిలంక గ్రామాల పేద ప్రజానీకం తరపున శ్రీ అమ్ముల రామయ్య, శ్రీ కాగిత శ్రీరామమూర్తి గార్లు కలెక్టరుగారి పర్సనల్ అసిస్టెంటును కలుసుకుని చౌకడిపోలు పెట్టించవలసిందని కోరుతూ మెమొరాండం యిచ్చారు.

కాని ఆఫీసరు ప్రతిచోటా డిపోలు పెట్టేందుకు అవకాశంలేదని అన్నారు అధికార్లు అవిధంగా సమాధానం చెపితే భూములులేని ప్రజాసామాన్యమేమికావాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

(మా. వి.)

ఆత్రేయపురంలో

ఆత్రేయపురం ఆగస్టు 12,

ఆత్రేయపురంలో ధరలు విపరీతంగా పెరిగినందున కొనలేక, అసలు బియ్యమే దొరకక సామాన్య ప్రజలు అగచాట్లు పడుతున్నారు. వివిధ గ్రామాలలో సంతకాలు సేకరించి 11-8-52న ప్రజాసంఘాల ప్రతినిధులు రెవిన్యూ యినస్పెక్టరుకు ఒక మెమొరాండం సమర్పించారు.

ప్రతి గ్రామంలో చౌకడిపోలు పెట్టి అందరికి బియ్యం చౌకగా అందచేయాలనీ, ధాన్యంధరలు పెరగకుండా అదుపుచేయాలనీ, మెమొరాండంలో వివరించారు.

తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ చంద్రమౌళిపంతులు శ్రీ ముసునూరు సుబ్బరాజు మొదలగువారు మెమొరాండమును యినస్పెక్టరుకు అందజేశారు.

రెవిన్యూ యినస్పెక్టరు సమాధానం చెపుతూ సాధ్యమైనంతవరకు అన్ని ప్రాంతాల్లోను చౌకడిపోలు ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చెప్పారు.

చౌకడిపోలు పెట్టాలి

ఆత్మకూరు కమిటీతీర్మానం

ఆత్మకూరు, ఆగస్టు 18

ఆత్మకూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశమై దిగువ తీర్మానాలు చేసారు.

కంట్రోల్సురద్దుతో ఆత్మకూరు తాలూకాలో ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగే ధరల అందుకోలేక పేదప్రజలు పస్తులతో మాడుతూ చౌకడిపోలకోసం ప్రభుత్వానికి యెన్ని అర్జీలు పెట్టుకొన్నా పలకడంలేదు. ప్రభుత్వం యీనిర్లక్ష్యవైఖరిమాని అన్నిగ్రామాల్లో చౌకడిపోలు తెరచి అధికధరలనుండి పేద ప్రజల రక్షించ పూనుకోవాలని కోరుతూ తీర్మానించారు.

ఆత్మకూరులోని బోర్డుహైస్కూలు సెలవుల అనంతరం ప్రారంభమై సుమారు రెండునెలలు కావస్తున్నప్పటికి హెడ్మాస్టరును నియమించకపోవడం కడువిచారకరం. తక్షణమే హైస్కూలుకు హెడ్మాస్టరునుపంపి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ తీర్మానం చేశారు.

అధికధరలు పెట్టి ధాన్యం తరలింపు

కమలాపురం, ఆగస్టు 14

మద్రాసుప్రభుత్వం, డీ కంట్రోలు విధానంవల్ల మొదట్లో వడ్లధర పుట్టి (500 సేర్లు) రు 220 లకు తగ్గి తిరిగి నేడు రు 280లో పడింది. పాలరాగులు రూ 1కి 1 3/4 సేర్లు యిస్తున్నారు. కమలాపురంలో రు 1కి 3/4 సేరు బియ్యం అమ్ముతున్నారు. అప్పుడు తయారైన ‘ఆహ్లాదం’ వడ్లు పుట్టి 1కి రు 180ల వరకు అమ్ముతున్నవి.

కమలాపురంఫిర్కా- పెద్దచెప్పలి, చుట్టుపక్క గ్రామాల్లో స్టాకువున్న వడ్లు కడప, కమలాపురం, వస్తూరు వర్తకులు అధికధరను పెట్టికొని లారీలతో రవాణాచేస్తున్నారు. ఈధరల పెరుగుదలను, రవాణాలనుచూచి ఆగ్రామాల బీదప్రజానీకం ఆందోళనపడుతున్నారు. దినికితోడు వర్షాలు వచ్చే సూచనలు కనబడక రైతాంగం హడలిపోతున్నారు. ప్రభుత్వం ఈధరల పెరుగుదలను అరికట్టకపోతే ప్రమాదపరిస్థితు లేర్పడుతాయి. (మా. వి)

ప. గో. జిల్లా కలెక్టరుకు మెమోరాండం

ఏలూరు, ఆగస్టు 12

8-8-52 తేదీ ఉదయం గం 11-30 లకు జిల్లా కమ్యూనిస్టు కమిటీ తరపున శ్రీ సంకు అప్పారావు, జిల్లా రైతుసంఘం తరపున శ్రీ అన్నే వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయకూలీసంఘం తరపున శ్రీ యాళ్ళబండి రంగనాయకులు, తాలూకా, పట్టణ కమ్యూనిస్టు కమిటీ సభ్యులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు ప. గో. జిల్లాకలెక్టరుగారిని కలుసుకొని ఆహార సమస్యను చర్చించి వెంటనే ఈ సమస్యా పరిష్కారానికి తగిన కొన్ని సూచనలతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు.

బియ్యం సేరు 1కి 0-7-6 ఖరీదుకు లభించే విధంగా చర్యతీసికోవాలనీ, చౌకడిపోలు జిల్లా మొత్తానికి విరివిగా నెలకొల్పాలని, చౌక డిపోలలో ప్రతి వ్యక్తికి 16 ఔన్సుల బియ్యాన్ని సరఫరా చేయాలని, ధాన్య సేకరణలోనూ, పంపకంలోను, సరఫరాలోను అక్రమాలు జరగకుండా వుండుటకు ప్రజలచే ఎన్నుకోబడిన ఆహారకమిటీల నిర్మాణాన్ని కోరిరి. జిల్లాల్లో విరివిగా చౌక డిపోలు ఏర్పాటు చేస్తామని మాత్రమే జిల్లా కలెక్టరు సమాధానం చెప్పారు. మిగతా పని మద్రాసు ప్రభుత్వానికి సంబంధించిన దన్నారు.

జూట్, చేనేత, మ్యునిసిపల్, సిగరు, టానరీ, కార్మికులు సాయంత్రం పట్టణంలో ఊరేగింపు జరిపి పేరయ్య కోనేటి ఆవరణలో శ్రీ మొటపర్తి కూర్మారావు (యం. యల్. ఎ.)గారి అధ్యక్షతనసమావేశమయ్యారు ప్రజలపై రాజాజీ ప్రభుత్వం విధించ నున్న పన్నులను యం. డి. యఫ్. అసెంబ్లీలో ఏ విధంగా వ్యతిరేకించనున్నారో వివరించి ప్రజలు యీ విషయంలో అచరించాల్సిన కర్తవ్యాలను అధ్యక్షులు స్పష్టీకరించారు.

తరువాత కామ్రేడ్స్ సంకు అప్పారావు, అన్నే సర్వేశ్వరరావుగారలు ఆహార పరిస్థితిని గూర్చి, కలెక్టరుతో చేసిన సంభాషణలను గూర్చి వివరించారు

బస్సులమీద సర్‌చార్జీలను, అభివృద్ధి పన్నులను రద్దుచేయ వలసిందిగా తీర్మానింపబడినది. (మా వి)

నిర్బంధ బేదఖలీలు

నిరసిస్తూ జనగాంలో 3 వేల ప్రజల సభ

అన్నిరకాల బేదఖళ్లను ఆపుచేస్తూ, వెంటనే ఆర్డినెన్సు ప్రకటించాలని డిమాండు

హైద్రాబాదు, ఆగస్టు 14

జనగామలో వారంరోజుల క్రిందట ‘నిర్బంధ బేదఖలీ’ వ్యతిరేక మహాసభ జరిగింది. శ్రీ చెలసాని వాసుదేవరావు వి. డి. దేశపాండే, అఖ్తరు హుసేన్, ఆరుట్ల రామచంద్రారెడ్డి ప్రభృతులు ఈ సభలో ఉపన్యసించారు. మూడువేల మంది ప్రజలు పాల్గొన్నారు.

సభకు ముందు మూడువందలమంది కార్యకర్తలు ఎర్రజెండాలతో, బేదఖలీ వ్యతిరేక నినాదాలతో నాయకుల నూరేగించారు. సాయంత్రం 7 గంటలకు అమరవీరులకు జోహారు లర్పించడంతో సభ ప్రారంభమైంది. శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి సభకు అధ్యక్షత వహించారు.

ఆరు సంవత్సరాల క్రిందట, విసునూరు దేశముఖు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి దొడ్డి కొమరయ్య ఆత్మబలిదానంతో ప్రారంభమైన ఉద్యమాన్ని శ్రీ వి. డి. దేశపాండే తమ ఉపన్యాసంలో సమీక్షించారు; రక్షిత కౌలుదారీ శాసనంలోని బండారాన్ని బైటపెడుతూ ప్రభుత్వ జమీందారీ అనుకూల విధానాన్ని శ్రీ దేశపాండే నిశితంగా విమర్శించారు.

విశాలాంధ్ర ఏర్పడేవరకు

శ్రీ చెలసాని వాసుదేవరావుగారు మాట్లాడుతూ తెలంగాణా రైతుల భూతృష్ణను, ఆంధ్ర జాతీయసమైక్యతా కాంక్షను వివరించారు. మోసపుచట్టాల ద్వారాకాని, భూదాన యజ్ఞాలాంటి వేషాలద్వారాగాని తెలంగాణా రైతులనుమభ్యపెట్టడం అసంభవమని కాంగ్రెసుపెద్దలు గ్రహించిన విషయాన్ని వెల్లడించారు.

కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన వర్గ సంఘాల ద్వారా పోరాడి విశాలాంధ్రను, నిజమైన ప్రజారాజ్యాన్ని సాధించుకోవాలని చెపుతూ, అంత వరకు దేశానికి శాంతి అభ్యుదయాలుండబోవని శ్రీ వాసుదేవరావుగారు హెచ్చరించారు.

జనగామ నియోజకవర్గం నుండి పి. డి. యఫ్ పక్షాన శాసనసభ్యుడుగా ఎన్నికైన శ్రీ అఖ్తర్ హుసేన్ ఉర్దూలో ప్రసంగిస్తూ బేదఖలీలకు అవకాశంఇచ్చే బూటకపు చట్టాలను, ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రానికి దఖలు పరచే ప్రయత్నాలను, నిశితంగా విమర్శించారు. తెలంగాణా ఉద్యమం గడించిన అంతర్జాతీయ ఖ్యాతిని వివరించారు.

శ్రీ అప్పారావుగారు మాట్లాడుతూ పూనూరుదొర, విసునూరు దొరలు రైతులపై బేదఖలీద్వజం ఎత్తిన వైనాన్ని, వారికి పోలీసులు, ప్రభుత్వం మద్దతునిస్తున్న వైనాన్ని వివరించారు.

ఆహారమంత్రి చెన్నారెడ్డిగారు జనగామవచ్చి కంట్రోళ్లు తొలగిస్తామని ప్రకటించిన మర్నాడే బ్లాకు మార్కెటుదారులు విజృంభించి ఆహారధాన్యాల ధరల్లో పది రూపాయలు పెంచినవిషయాన్ని ప్రస్తావించి, బ్లాకు మార్కెటులో సర్కారు గోదాములలోని గింజలనే అమ్ముతున్నారని వెల్లడించారు.

ముల్కీ సమస్య

గైరు ముల్కీలు వెళ్ళిపోవాలని ఇటీవల ప్రచారంలోవున్న ఉద్యమాన్ని గురించి ఒక ప్రశ్న వచ్చింది యీ ప్రశ్నకు సమాధానం ఇస్తూ శ్రీ అప్పారావుగారిలా అన్నారు

“ఈనాడు ఈ నినాదాన్ని విద్యార్థులు తీసుకొని పట్టు చేయడం చాలా విచారకరం దీన్ని ఎవరో రక్షేమూతా వారు ప్రేరేపించి వుంటారు. యిది హిందూ ముస్లింకలహాలాంటిదే నిజంగా నిరుద్యోగానికి కారణం ప్రభుత్వంకాని గైరు ముల్కీలు కారని మనం గుర్తుంచుకోవాలి ”

బంజర్లు

బంజర్లనుండి రైతులను తొలగిస్తున్న విషయాన్ని ప్రస్తావించి ఈ తాలూకాలో వందలఎకరాల బంజర్లను నైజాం కాలంనుంచీకూడా హరిజనులు, పేదరైతులు సాగుచేసుకొంటున్నారని, సర్కారువారు సాగుకొరకు ప్రతి ఏటా వీరికి అనుమతినిస్తూ వుండేవారని శ్రీ అప్పారావు గారన్నారు. ఈ సంవత్సరం కూడా మొదటలో అలాగే జరిగింది. కాని యిప్పుడు ఆ భూములను సాగు చేయరాదని తాసీల్దారు ప్రతిగ్రామానికి హుకుములు పంపించారు. మూడు నెలల పైరు వున్న భూములపైకి కూడా హరిజనులను పోనీయకుండా అటకాయిస్తున్నారు ఇదొకరకం కొత్త బేదఖలీ.

ఎన్నికలకు ముందు బూ. రా. గారు స్వయంగా బంజరుభూములను పంచిన విషయాన్ని ప్రస్తావించి అభూములను అక్కరతీరగానే, నేడు అప్రభుత్వమే గుంజుకొంటున్నదని కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో గుంజుకునే విధానాన్ని ప్రభుత్వం అవలంబించిందని శ్రీ అప్పారావు గారన్నారు.

తర్వాత బేదఖలీలను ఆపివేయాలని, పోలీసు జోక్యాన్ని అరికట్టాలని, తక్షణం ఆర్డినెన్సు ప్రకటించి అన్ని రకాల బేదఖలీలను నిషేధించాలని, తొలగింపబడిన రైతులకు తిరిగి భూములను అప్పగించాలని, చట్టవిరుద్ధచర్యలకు పూనుకొన్న విసునూరుదొరను, అతనికి మద్దతిస్తున్న అమీన్ సత్తిరెడ్డిని శిక్షించాలని తీర్మానించారు. (మా. వి.)

దొంగసారాయి

ఖాజీపేట, ఆగస్టు 13

జనగామ ముస్తాజర్లు గంగాధర మొదలియార్, పద్మారావు మొదలియార్ కారులో 5 గ్యాలన్ల దొంగ సారాయి తీసుకొని పోతూండగా ఖాజీపేటవద్ద అధికారులకు పట్టుబడినట్లు, వీరుభయులూ చిక్కకుండా పారిపోయినట్లు తెలుస్తున్నది. వీరి యింటిలో సారాయి దొరికె, అవిషయమై ఇప్పటికే ఒక కేసు నడుస్తున్నది. (మా. వి)

కృష్ణా జిల్లా పొగాకు మార్కెట్ కమిటీ

అనుమతిలేకుండా గవర్నమెంటు అప్పుకు 80 వేలు యిచ్చినందుకు సెక్రటరీ చర్యపై నిరసన

విజయవాడ, ఆగస్టు 16

కృష్ణాజిల్లా పొగాకు అండ్ వేరుశనగ మార్కెట్ కమిటీకి కార్యదర్శిగా వుంటున్న ప్రభుత్వోద్యోగి శ్రీ యం.పి. నరసింహారావు కమిటీతోగానీ, అగ్రికల్చరల్ డైరెక్టరుతోగానీ సంప్రతించకుండా, కమిటీసొమ్ము ఎనభైవేల రూపాయలను ప్రభుత్వానికి అప్పుగా యిచ్చినందుకు నిరసన తెలియజేస్తూ యిప్పాళ విజయవాడలో శ్రీ మండవ వెంకటరత్నం అధ్యక్షతకు జరిగిన కృష్ణా జిల్లా పొగాకు, వేరుశనగ మార్కెట్ కమిటీ అత్యవసర సమావేశం తీర్మానించింది. ఈ 80 వేలలోనూ గొల్లపూడిలో గోడౌన్ను కట్టడానికిగాను ప్రత్యేకించబడ్డ 50 వేల రూపాయల నిధికూడా వున్నదట.

కమిటీ కారును ఉపయోగించడంలోనూ, కమిటీసొత్తును వినియోగించడంలోనూ, కమిటీకిఆదాయం సమకూర్చడంలోనూ, ఉద్యోగ నిర్వహణలోనూ కార్యదర్శి ప్రవర్తన సక్రమంగాలేదనీ, తనకిష్టులైనవారికి యార్డులోని చెత్తాచెదారపు కుప్పల్ని నామమాత్రపు ధరలకు యిస్తున్నారనీ,కమిటీ యొక్క అధికారాన్ని ప్రతిష్ఠను కించపర్చడానికై కార్యదర్శి తన అధికారానికి మించి ప్రవర్తిస్తున్నాడనీ కొన్ని ఘటనలను ఉదహరిస్తూ కమిటీ తీర్మానించింది.

ఈ నెల 9వ తేదీన జరిగిన సమావేశంలో యీ కార్యదర్శినే మరో సంవత్సరంపాటు ఉద్యోగంలో వుంచవలసిందిగా ప్రభుత్వానికి సిఫార్సుచేస్తూ గావించిన తీర్మానాన్ని రద్దుచేయడానికి కూడా కమిటీ నిర్ణయించింది.

తన ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించని యీకార్యదర్శిని ప్రభుత్వం వెనక్కి పిలిపించుకోవాలనీ, రానున్న సంవత్సర కాల పరిమితికి మరో సెక్రటరీని నియమించవలసిందని కూడా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

యిద్దరు సభ్యుల వాకౌట్

కమిటీ సభ్యులైన వల్లమూడి సీతారామస్వామి,బచ్చు వెంకటేశ్వర్లుగార్లు యీ సమావేశం చెల్లనేరదని అభ్యంతరాలు తెలియజేస్తూ మీటింగునుంచి వాకౌట్ చేశారు. మీటింగుకు ముందు కనీసం వారం రోజుల నోటీసైనా యివ్వాలనీ, యీ సమావేశానికి అట్టి నోటీసు లేదనీ, ఒకసారి కమిటీ ప్యాసు చేసిన తీర్మానాన్ని మూడు నెలల్లోగా రద్దుచేయడానికి వీల్లేదనీ వారు తెలిపిన అభ్యంతరాలు.

చట్టం ప్రకారం, కమిటీ బైలాల ప్రకారమూ యీ మీటింగు సక్రమంగానే జరిగిందని హాజరైనవారిలో మిగతా ఆరుగురూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

బరంపురంలో ఆసియా శాంతివారం

బరంపురం, ఆగస్టు 12

ఆసియా శాంతివారం నిన్న స్థానిక టౌనుహాలులో జరిగిన సందర్భంలో వివిధ పక్షాలవారు పాల్గొన్నారు. సభకు శ్రీ అయ్యగారి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు.

శ్రీ జె. వి. రమణమూర్తి (గంజాం కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ) అగ్రరాజ్యాల మధ్య శాంతి ఒడంబడికకు పండిట్ నెహ్రూ పూనుకోవాలని విజ్ఞప్తి గావించారు.

కల్లికోట కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ అమెరికా యుద్ధోన్మాదాన్ని నిరసించుచూ, శాంతి కొరకు అత్యవసరంగా కృషి చేయాలన్నారు.

శ్రీ గోవింద్ ప్రధాన్ ఎమ్. ఎల్. ఏ. గారు, శ్రీ హరిచంద్ బెహారా, శ్రీ దూతి కృష్ణపండా, శ్రీ హరికృష్ణ సాహూ, శ్రీ ఈశ్వర్ సాహూ గారు కూడా మాట్లాడిరి.

అత్యధిక సంతకాలు చేయించిన వారికి బహుమతు లిచ్చుటకు నిర్ణయించిరి.

ఆగస్టు 18 సోమవారం
నందన సంవత్సర శ్రావణ బ॥
త్రయోదశి మ. 3-30 వరకు
పునర్వసు ఉ. 6-43 వరకు

లేఖలు

మైలవరం హరిజన్ హాస్టలు విద్యార్థుల ఆక్రందనాలు

మైలవరం, ఆగస్టు 11

మైలవరం హరిజన్ హాస్టలు విద్యార్థులు ఉపవాసములు చేస్తున్నారు. హాస్టలు మేనేజిమెంటు ఒక పూట నీళ్ళచారు, రెండవపూట చాలీచాలని అన్నం పెడుతున్నారు. విద్యార్థులు హాస్టలు విషయాలు ఏ అధికారితో చెప్పినా హాస్టలునుండి గెంటిస్తానని బెదిరింపులు సాగిస్తున్నాడు. విద్యార్థుల స్థితి చూచినవారు, గ్రామంలోని వుదారులైన యువకులు చందాల ద్వారా సహాయకరిస్తున్నారు.

విద్యార్థులు గ్రామంలో యిండ్లవెంట తిరిగి అన్నం పోగుచేసుకుంటున్నారు.

బాలికల వస్తువులు దాచిపెడతానని తీసుకొని మేనేజిమెంటు తాకట్టుపెడుతున్నట్లు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ అధికారులకు ఎన్ని మహజరులుపంపినా “నిమ్మకు నీరెత్తినట్లు”, ఊరుకుంది. హాస్టలు మేనేజరు 50 మంది బాలబాలల భవిష్యత్‌తో జూదం ప్రారంభించాడు విద్యార్థులు చదువు సాగటంలేదని టి. సి. లు కొరకు ప్రయత్నించుచున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే జోక్యం కలిగించుకొని మేనేజిమెంటుని రద్దుచేసి ప్రజాతంత్రవాదులతో కమిటీని నియమించి హాస్టలు నిర్వహణ అప్పగించాలని కోరుచున్నారు.

దూర్వాసుల వెంకటకృష్ణారావు

విజయవాడలో

విజయవాడ, ఆగస్టు 18

అయ్యా!

9-8-52 తేదీ విశాలాంధ్రలో “విజయవాడ పున్నమ్మతోట హరిజన హాస్టలులో యిబ్బం[illegible]” అని ప్రచురించబడ్డ లేఖలో [illegible] కావు హాస్టల్లో [illegible]తులు సంతృప్తికరంగానే వున్నవి ఈవిషయం ప్రచురించ గోరుతున్నాము

ఇట్లు,
పున్నమ్మతోట
హరిజన హాస్టలు విద్యార్థులు.

[ఈ లేఖను 30 మంది హరిజన హాస్టలు విద్యార్థులు మా కార్యాలయంలో యిచ్చారు. ఇందులో మొదటి ప్రచురించబడిన లేఖను వ్రాసి యిచ్చిన దేవదాసు అనే విద్యార్థికూడా సంతకం చేశాడు. ఈ విషయమై మా విలేఖరి స్వయంగా వెళ్ళి విద్యార్థులను కలుసుకోగా హాస్టల్లో కొన్ని యిబ్బందులు లేకపోలేదని అయినా, గత్యంతరంలేక సంతకాలు పెట్టామని అన్నారు-సం॥]

రీడింగు రూములో పాతపత్రికలే గతి

అనంతపురం, ఆగస్టు 18

మావూరి రీడింగ్‌రూము చాల అధ్వాన్నంగావుంది. పేపర్లు ఒకటికూడ వుండదు. అన్ని పాతపేపర్లు చదువాలి. పుస్తకాలు చదువడానికి అందుబాటులో వుండవు. ఇందువిషయమై అధికారులు ఏమికూడ శ్రద్ధ వహించటంలేదు. అందువలన త్వరలో శ్రద్ధ తీసుకోవలెనని హెచ్చరిస్తున్నాను.

—స్వామిరావు.

స్పెషల్ పోలీసులచే గంజికేంద్రం ఆక్రమణ

మాచెర్ల, ఆగస్టు 14

పల్నాడు తాలూకా పుల్లారెడ్డిగూడెంలో సుమారు నెలా పదిహేను రోజులనుండి ఐక్యక్షామనివారణ కమిటీ వారిచే సంకటికేంద్రం సదరుగ్రామ సత్రంలో పెట్టి నడపబడుతూవున్నది. ప్రతిరోజు దాదాపు 400 మంది వరకు కేంద్రంకు వస్తున్నారు.

తాపేశ్వరంలో

తాపేశ్వరం, ఆగస్టు 16

తూర్పు గోదావరిజిల్లా తాపేశ్వరంలో స్థానిక కో-ఆపరేటివ్ సంస్థల వారందరూ కలిసి జరిపిన స్వాతంత్ర్యోత్సవ సభ శ్రీ మల్లాది సత్యంగారి అధ్యక్షతను జరిగింది. పలువురుప్రసంగించిన తర్వాత అల్పాహారవిందు జరిగింది.

అదనపు పన్నుల రద్దుకు తీవ్ర ప్రజాందోళన

రు 150 పైగా శిస్తు చెల్లించే వారి పైనే సర్చార్జి విధించాలని సభల్లో డిమాండు

తిరువూరు, ఆగస్టు 12

ది 10-8-52 మధ్యాహ్నం 2 గంటలకు తిరువూరులో శ్రీ గోపాల నాగేశ్వరరావు (స్థానిక ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ) గారి అధ్యక్షతన తిరువూరు నియోజకవర్గ రైతుల సమావేశం జరిగింది. 30 గ్రామాలనుంచి 100 మంది ప్రతినిధులు సమావేశానికి హాజరైనారు.

శ్రీ పేట రామారావు యం. ఎల్. ఏ. గారు సర్‌చార్జి, బస్సు ప్రయాణీకులపై పన్ను, అభివృద్ధిపన్నుల బిల్లులను గురించి, ఆంధ్రరాష్ట్రం, కృష్ణా-పెన్నారు ప్రాజెక్టులనుగురించి అసెంబ్లీలో జరిగిన చర్చల సారాంశాన్ని విపులంగా వివరించారు. పై బిల్లులు పేద ప్రజాసామాన్యాన్ని కృంగదీస్తాయని కృష్ణా-పెన్నారు ప్రాజెక్టువల్ల ఆంధ్రులకు తీరని అపచారం సంభవిస్తుందని, కనుక మనందరు తీవ్రంగా వాటిని ఎదిరించి సత్వరాంధ్రరాష్ట్రం కొరకు అవిరళ కృషి చేయాలంటూ ప్రోత్సహించారు.

స్థానిక ఆహారసమస్యను గురించి, ఇతర సమస్యలను గురించి శ్రీ సుంకర వీరభద్రరావుగారు (తా॥ రై॥ ఆర్గనైజరు.) ప్రసంగించారు. ప్రభుత్వం కంట్రోళ్ళను ఎత్తివేయటంద్వారా పేద ప్రజల ప్రాణాలతో చెలగాట మాడిరదని, దీనికితోడు వర్షాభావం వలన కూలీలు నిరుద్యోగులై పస్తులుంటున్నారని: దొగ్గల, చెందల, గంజేరు మొదలైన ఆకులు, ఈత గుజ్జు వగైరాలు తిని జబ్బులకుకూడా గురిఅవుతున్నారని, ప్రభుత్వం వెంటనే గమనించని ఎడల రెండవ రాయలసీమగా తయారయ్యే ప్రమాదముందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

భూమిశిస్తుపై సర్ చార్జి 150 రూపాయలపైన చెల్లించేవారికే వెయ్యాలని అభివృద్ధి పన్నును పూర్తిగ [illegible] బస్సు ప్రయాణీకులపైన [illegible] పూర్తిగా రద్దుచేయాలని, తాలూకాలో కొత్తబస్సు రూట్లు యిచ్చుటద్వారా ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుందని కృష్ణా-పెన్నారు ప్రాజెక్టును పూర్తిగ ప్రతిఘటించాలని వివాదరహిత ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించాలని గ్రామ గ్రామాన చౌకడిపోలుపెట్టి, నిరుద్యోగులైన కూలీలకు ఇరిగేషన్ పనులు చూపించాలని తీర్మానాలు చేశారు.

రాత్రి 9 గంటలకు శ్రీ నరసాపురం శ్రీరంగంగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో కూడా పై తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి. పైరు లోటులు వగైరాలకు తక్కావీ అప్పులు పేదరైతులకు విరివిగా గ్రాంటు చేయించాలని కూడ తీర్మానించబడింది.

150 పైగా చెల్లించే వారిపైనే సర్‌ఛార్జి

పాలకొల్లు, ఆగస్టు 13

ప్రభుత్వం విధించనున్న అదనపు పన్నులకు వ్యతిరేకంగా నర్సాపురం తాలూకాలో ఆందోళన ప్రారంభమైంది. యీ క్రింది గ్రామాలలో బహిరంగ సభలు జరిగాయి.

6-8-52 తేదీన కామ్రేడ్ యిందుకూరి సూర్యనారాయణరాజుగారి అధ్యక్షతను జిన్నూరు గ్రామంలో బహిరంగ సభ జరిగింది. సభకు 800 మంది రైతు కూలీలు హాజరయ్యారు. కామ్రేడ్ భూపతిరాజు లక్ష్మీనరసరాజు యం. యల్. ఏ గారు మాట్లాడుతూ "యీ రోజు రాజాజీ ప్రభుత్వం పన్నులు విధించుతున్నది. ప్రజాక్షేమం కోసం కాదని, ప్రజలను పీడించే నిర్బంధయంత్రాన్ని బలపర్చడానికే" అని చెప్పారు. భూమిమీద సరఛార్జి విధింపు సరైనది కాదని, ఆదాయంమీద పన్ను విధించాలని కోరారు. 150 రూపాయీల భూమిపన్ను చెల్లించేవారిమీదనే సర్ ఛార్జి విధించాలని డిమాండు చేశారు.

అసెంబ్లీ విశేషాలను ముచ్చటిస్తూ రాజాజీ విశ్వాస తీర్మానం ద్వారా డెమొక్రటిక్ ఫ్రంటును విచ్ఛిన్నముచేసి తన ప్రజావ్యతిరేక బడ్జెటును ప్యాసు చేయించుకోవాలని చూశాడని, కాని అలా జరగనివ్వకుండా ప్రతి పక్షం అడుగడుగునా తీవ్ర ప్రతిఘటన ద్వారా రాజాజీ ఎత్తులను భగ్నం చేసిందని చెప్పారు.

సభలో 150 రు భూమి పన్ను చెల్లించే వారిపైననే సర్‌చార్జి విధించాలని, బెటర్‌మెంటుటాక్సు, బసుటిక్కెట్లమీద సర్‌చార్జీలు రద్దుచేయాలని కోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి.

పోడూరులో

7-8-52 తేదీ రాత్రి పోడూరులో యీ డిస్ట్రిక్టు బెన్ గారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. 800 మంది ప్రజలు వచ్చారు. కా॥ భూపతిరాజు లక్ష్మీనర్సరాజుగారు అసెంబ్లీలో డెమొక్రటిక్ ఫ్రంటు యేవిధంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడిందో వివరించారు.

150,రు పన్నుపైన సర్‌చార్జి విధించాలని అభివృద్ధిపన్ను, బస్ సర్‌చార్జీలు రద్దు చేయాలని తీర్మానాలు చేయబడ్డాయి.

ములపర్రులో

8-8-52 తేదీ సాయంకాలం ములపర్రులో బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిగింది. కూలీలు ఆరోజు పనులు మానివేసి సుమారు వెయ్యి మందికి పైగా వచ్చారు. శ్రీ లక్ష్మీనర్సరాజుగారికి ఘనస్వాగతం యిచ్చారు.

శ్రీ నర్సరాజు ఎం.ఎల్.ఏ. గారు మాట్లాడుతూ రాజాజీ ప్రభుత్వం డీకంట్రోలు పెట్టి ప్రజలకు తిండి పెట్టే బాధ్యత వదులుకొన్నదని, అంతే గాకుండా ధాన్యం ధరలు పెరిగిపోతున్నాయని అసెంబ్లీలో చెప్పితే అసెంబ్లీలో మాత్రమే పెరిగాయని మాత్రమే బుకాయించాడని చెప్పారు. చౌకడిపోలు తెరవాల్సిన అవసరాన్ని గూర్చి మద్రాసునుండి రావడంతోనే సబ్‌కలెక్టరుతో చెప్పానని తెలియ చేశారు.

సర్ ఛార్జి, బస్ సర్ ఛార్జీల రద్దుమీదను, చౌకడిపోలు తెరవాలని తీర్మానాలు చేశారు.

దేవగ్రామంలో

8-8-52 తేదీ రాత్రి దేవగ్రామంలోను 9-8-52 తేదీ వుదయం ఆచంట శివారు శేవమ్మ చెరువుదగ్గర బహిరంగ సభలు జరిగాయి. భూపతిరాజు లక్ష్మీనర్సరాజుగారు మాట్లాడారు. సర్ ఛార్జిని గూర్చి, యింకా యితర పన్నులను గూర్చి వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయబడినాయి.

ప్రజా ఉద్యమమే పార్లమెంటరీ కార్యక్రమానికి బలం

శ్రీ ఆనందనంబియార్ ప్రసంగం

బిట్రగుంట, ఆగస్టు 15

ఢిల్లీ పార్లమెంటు సభావేశాలనుండి దక్షిణ రైల్వే కార్మిక నాయకుడు శ్రీ ఆనందనంబియార్ బిట్రగుంట మీదుగా తిరిగి వెడుతున్న సందర్భంలో నిన్న ఇక్కడ రైల్వే కార్మికులు స్వాగతం యిచ్చి బహిరంగ సభ జరిపారు.

రైల్వేలమీద వచ్చే ఆదాయం 100 కోట్లలో ప్రజల ప్రయాణ సౌకర్యాలకు 8 కోట్లు, రైల్వే కార్మికులకు ఒక కోటి మాత్రమే ఖర్చు పెట్టుతున్నదని శ్రీ నంబియార్ వెల్లడించారు. సెంట్రల్ పేకమిషన్ 70 రూపాయలు కరువుభత్యం యివ్వాలని నిర్ణయించినా, రు 30 లు మాత్రమే యిస్తున్నది అన్నారు. పార్లమెంటులోని చర్చల గురించి చెబుతూ, ప్రతిపక్షం యిచ్చిన నిర్మాణాత్మక సూచనలను కూడా సైతం ప్రభుత్వం సరకు చేయుటలేదని చెప్పారు. బయట ప్రజాఉద్యమాల బలమే - లోపల మేము సాగించే కృషికి జీవనాధారము అనికూడా ఆయన అన్నారు.

శ్రీ ఆనందనంబియార్ తన చైనా పర్యటనానుభవాలను చెప్పినప్పుడు కార్మికులు ఎంతో ఉత్తేజం పొందారు. "చైనా జాతీయ పురోభివృద్ధి చక్కగా సాగుతూంటే, భారతదేశం సామ్రాజ్యవాదులపై ఆధారపడి ఉండుటవల్ల పారిశ్రామిక అభివృద్ధి పొందుటలేదని, రైలు ఇంజన్లు నేటికీ విదేశాలనుండే దిగుమతి అవుతున్నాయనీ" ఆనంద నంబియార్ వివరించారు.

సభకు సుమారు 1000 మంది రైల్వే కార్మికులు, ఇతరులు హాజరైయ్యారు.

బెల్లంపల్లి కార్మికుల నిరసనసభ

బెల్లంపల్లి, ఆగస్టు 13

బెల్లంపల్లి కార్మికులు నిన్న బహిరంగసభ జరిపి మేనేజిమెంటు ఆర్డర్లను నిరసించారు. ఓదేలు అనే ఒక కార్మికుడు ఆత్మహత్య చేసుకొన్నందుకు దుఃఖ సంతాప సూచకంగా కార్మికులు ఒక రోజున పనిమానివేసి సభ జరుపుకొన్నారు. అందుకు సందుకు మేనేజిమెంటుఅరుగురుకార్మికులను తొలగించు జారీ చేశారు. ఈ చర్యను ఖండిస్తూ, సభలో పలువురు ఉపన్యసించారు. సోషలిస్టుపార్టీ నాయకత్వ వైఖరిపట్ల నిరసనగా ఆ పార్టీనుండి వెలికివచ్చిన శ్రీ జి మొండెగారు ఉపన్యాసకులలో ఒకరు. (మా వి)

ప్రగడ కోటయ్యగారి పరువు నిల్పుటకువచ్చిన రెవెన్యూమంత్రి

ఎక్కడకు వెళ్లినా ఎదురైన పీడిత ప్రజల ప్రదర్శనలు

బాపట్ల, ఆగస్టు 15

రివెన్యూ మంత్రిగారిని వెంటబెట్టుకుని తిరిగితే ప్రజలు మురిసిపోయి పూలమాలలు వేస్తారనీ, రంగు ఫిరాయించిన పాపం పరిహారమవుతుందనీ ప్రగడ కోటయ్యగారు తలిస్తే - ఎక్కడికక్కడ కాంగ్రెసు ప్రభుత్వపు దుష్పరిపాలనలో బాధలు పడుతూన్న ప్రజలు తమ ప్రతినిధులతో ఎదురయ్యారు.

మద్రాసు రెవెన్యూశాఖా మంత్రి శ్రీ మాణిక్యవేలు నాయకరు, 11-8-52 ఉదయం చీరాల వచ్చారు. లోగడ ప్రకాశం పార్టీవారనని కమ్యూనిస్టు పార్టీ తోడ్పాటుతో ఎమ్.ఎల్.ఏ. గా గెల్చొంది ఈ మధ్య డెమొక్రటిక్ ఫ్రంటు నుంచి రాజీనామా యిచ్చిన శ్రీ ప్రగడ కోటయ్యగారు వీరిని వెంట బెట్టుకుని పర్యటనకు బయలుదేరారు. దారిలో యీపూరుపాలెం గ్రామ ప్రెసిడెంటు మెమొరాండం అర్పించారు. యిందులో కంట్రోళ్ళ ఎత్తివేతను ప్రశంసించారు పాపం. దురదృష్టవశాత్తు మంత్రిగారు వారలనుద్దేశించి కష్ట సుఖాల విచారణకు పూనగానే కడుపుకు తిండిలేక అంతా కాటకా వుందని ప్రజలు మొర. యింటింటికి వచ్చి వాస్తవాన్ని కళ్లారాచూడవచ్చున్నారు. చౌకడిపోలు పెట్టించాలని ప్రజలుఅతిదీనంగా మొరపెట్టుకున్నారు. ఆ ప్రెసిడెంటు గారి మెమొరాండం బండారం బయటపడింది.

ఇంక మంత్రిగారిని ఆహ్వానించి, కార్యక్రమం వేయించుకున్న రజకవాడకు ప్రయాణమయ్యారు. యింతలో వేటపూడి, కంకటపాలెం రైతాంగం కాగ్లనుజాచి గట్టు, డొంకలకు అడ్డంబడి పడుగులతో రోడ్డు ప్రక్కకు చేరారు. మంత్రిగారు ఆడవారు సైతం ఈ భూసమస్యపై మొరపెట్టుటకు పరుగెత్తుతుంటే నిశ్చేష్టులైపోయారు. మంత్రిగారికి తమ మహజరందించారు. రాజకీయబాధితులపేర, స్వాతంత్ర్య పరమయిన సంఘాలపేర ఎంతో త్యాగంచేసి ఆశ్రమములోనున్న భూము లనుంచి తమను తొలగించవద్దని మొరపెట్టుకున్నారు.

ఆ తర్వాత మంత్రిగారు ఖగ్గావారి రిజర్వు చూశారు. చిల్లర గొల్లపాలెం వెళ్లారు. స్థానిక శాసనసభ్యుడు శ్రీకృష్ణగారు ఆ ప్రజలకున్న సమస్యను తెలియజెప్పారు. ఖగ్గావారిరిజర్వు వేలాయతో ప్రభుత్వంనుంచి కవులుకు తీసుకొని స్వంతంచేసుకోజూస్తుంటే మంత్రిగారు కవులు రద్దుపరచి ప్రస్తుతంసేద్యం చేస్తున్నవారికి దక్కేట్లు చూడగలనన్నారు. పాపం దీంతో ప్రగడవారికి వెలగకాయ మింగినంతపనైంది.

తిరిగి వచ్చేటప్పుడు మంత్రిగారు హైస్కూలువద్ద వేచియున్న రైతాంగం గంటవద్దకు వచ్చారు. యిచట రైతులు తమతమ మహజర్లనందించారు. వీటి సారాంశాన్ని శ్రీ కృష్ణగారు తెలియజెప్పారు. పుష్పరిపాలెంవారి రాజకీయ బాధితులపోరు, మూల పాలెంవారి భూమితగాదా, అల్లూరు గ్రామానికి చెందిన రాజకీయ బాధితులు మంత్రిగారు మహజరులందుకొని వీరి రైతుకు భూమినిచ్చుట ప్రస్తుత ప్రభుత్వవిధానం, అయితే వున్న చిక్కుల నుండే బయటపడేందుకు వ్యవధి కావాలి గనుక రైతాంగం ఓర్పు వహించాలన్నారు.

యిచటనుండి తాలూకా ఆఫీసు మీదుగా తిరిగి చీరాల ప్రయాణమయ్యారు.

ప్రజలకు ఎలక్షను సందర్భంలో యిచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా కాంగ్రెసు మంత్రులకు తోడ్పాటుదారుడైనందున నష్టపడిన ప్రతిష్టను, మంత్రులను ఊరేగించి తిరిగి కూడదీసుకొనుటకే శ్రీ ప్రగడ కోటయ్యగారి తాపత్రయమని ప్రజలందరూ గ్రహించారు. (మా. వి.)

ఆగస్టు స్వాతంత్ర్యం ఆచరణలో!

సామర్లకోట, ఆగస్టు 15

ప్యారీకంపెనీ కార్మికులు అగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవపు శలవు బాకీని ఆదివారం పని చేసి ఋణం తీర్చుకోవాలని లక్షలు లాభాలు గడిస్తున్న యజమానులు నోటీసు పెట్టేరు. లక్షాధికారుల అగస్టు స్వాతంత్ర్యదినోత్సవపు పండుగకు కూడా లక్షాధికారులైన యజమానులు కార్మికులకు మరకులేని శలవు యివ్వడం లేదు. స్వతంత్రదినోత్సవం రోజున సామర్లకోట కార్మికులకున్న 'స్వతంత్రం' ఇదే!

ఆంధ్ర వ్యాయామ కళాశాల స్వతంత్రదినోత్సవం

విజయవాడ, ఆగస్టు 16

ఆంధ్ర వ్యాయామ కళాశాలలో ఆటల పోటీలు జరుపబడెను. సాయంత్రం 5 గంటలకు కళాశాల ఆవరణలో కాలేజి వైస్ ప్రిన్సుపాల్ గార్యైన శ్రీ యు. యస్ నారాయణ గారి అధ్యక్షతను సభ జరుపబడెను.

అధ్యక్షులు మాట్లాడుతూ రాయలసీమ కరువు మొదలగు అనేక పెద్ద సమస్యలమీదకూడ ఆంధ్రలోని వివిధ పార్టీలు,సంస్థలు ఎవరికివారే చిన్నవిధముగ వారు కృషి చేశారేగాని ఐక్యంగా కృషి చేయలేకపోవటం విచారకరం అన్నారు.

ఆంధ్రదేశంలో ప్రత్యేకంగా ఆంధ్ర వ్యాయామ కళాశాలను స్థాపించు విషయంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలవారు, వ్యక్తులు కలసి కృషి చేయుటవల్లనే వ్యాయామ కళాశాలను స్థాపించుటలో కలిగామున్నారు. ఇట్టి కళాశాలయొక్క ఆశయాలను విద్యార్థులు ఐక్యతతో ముందుకు తీసుకు పోవాలని కోరుచు కళాశాల అభివృద్ధికి అన్ని విధాల కృషిచేయాల్సిందిగా హెచ్చరించారు.

తరువాత కాలేజి లెక్చరర్ శ్రీ శ. సుబ్బారావుగారు మాట్లాడుచు ఆటల పోటీలు బహుమతుల కొఱకుకాక ఆటలలో టెక్నిక్‌ను నేర్పరితనాన్ని అభివృద్ధి చేసుకొనుటకేనని, స్పోర్ట్సుమన్ స్పిరిట్ విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. (మా. వి)

రాష్ట్ర కాంగ్రెసు సభ్యునిపై పోలీసుల ఘాతుక చర్య

నందికొట్కూరు., ఆగస్టు 14

నందికొట్కూరు తాలూకాలో రోజు రోజుకు మితిమీరుతున్న ప్రొహిబిషన్ పోలీసుల దౌర్జన్యాలతో ప్రజలు భయభ్రాంతులౌతున్నారు. గత ఆగస్టు 8 న జరిగిన దౌర్జన్య సంఘటన తాలూకాలోని మధ్యతరగతి కుటుంబాలవారిని కూడ కలతపెట్టింది.

ఆనాడు పారుమంచాల గ్రామంపై ప్రొహిబిషన్ డిప్యూటీసూపరింటెండెంటు వగైరాల నాయకత్వాన దాడి జరిగింది. ప్రొహిబిషన్ పోలీసులు బోయ అంకాలు అను వనిని పట్టుకొన్నారు. అతనిని విడిచిపెట్టవలసిందిగా, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ మెంబరు, ప్రొహిబిషన్ కేసుల్లో ప్రభుత్వ రివార్డు కూడా పొందిన శ్రీ శివశంకర రెడ్డి ఎంతో ప్రాధేయ పడ్డారు. రిజర్వు కానిస్టేబిల్ అంకన్న శ్రీ రెడ్డిని, బోయ అంకాలును పట్టిలాగితే, వారిద్దరు క్రిందపడిపోయారు. 'కొందర పడుతున్నావ'ని మందలించిన శ్రీ రెడ్డిని '......తన్నితే నీ శేకవరా దిమ్మ' వగైరా బూతులు తిట్టాడు; మరికొంతమంది పోలీసులను విజిల్ వేసి పిలిపించాడు.

ఈ సందర్భంలో రెడ్డిగారి అన్న శ్రీ చంద్రశేఖరరెడ్డి వచ్చి పోలీసులను శాంతపడమని కోరారు. ఇదంతా వినిపించుకోకుండా 'నడవండిరా దొరల దగ్గరికి'అని త్రోసుకొంటూ వెళ్ళారు. దారిలో కానిస్టేబిల్ తుపాకి మడమతో శ్రీ శివశంకర రెడ్డిని పొడిచాడు. రెండు నిముషాల పాటు ఆయనకు స్మారకం తప్పింది. అక్కడికీ వదలకుండా తమ 'దొరల' దగ్గరకి తీసుకొనివచ్చారు. "...కొడుకులను కాల్చివేయక యిక్కడ ఎందుకు తెచ్చారురా !'అని డోన్ సర్కిల్, నన్నూరు యస్. ఐ., పోలీసులను తిట్టారు.

శ్రీ శివశంకరరెడ్డి 14 సంవత్సరాలుగా కాంగ్రెసువాది. బ్రిటిషువారి కాలంలో 2 సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. తాలూకా ప్రొహిబిషన్ కమిటీమెంబరు ఈ విషయమై రాష్ట్రకాంగ్రెసు కమిటీ మెంబరు శ్రీ బి. సి., శివారెడ్డి, డోన్ తాలూకా కాంగ్రెసునాయకులు శ్రీ కే. ఇ. మాదన్నగారలు పై అధికారులకు టెలిగ్రాంలు ఇచ్చారు. పోలీసులు సాగించిన దౌర్జన్యం గురించి విచారించాలని ప్రజానీకం కోరుతున్నారు. (మా. వి.)

రేడియో

ఆగస్టు 19 మంగళవారం

విజయవాడ : 337.1 మీటర్లలో

ఉదయం : 7-0 (తె.వా); 7-15 మద్రాసు బి తలె; 7-30 మద్రాసు తలె; 8-0 (ఆం. వా); మధ్యాహ్నం: 12-30 మాధ్యమిక పాఠశాలా విద్యార్థులకు; 1-0 మద్రాసు బి తలె; 1-40 (హిం॥ వా॥); 1-50 (తె॥ వా॥); 2-0 మద్రాసు బి తలె; 2-15 ఉన్నత పాఠశాలా విద్యార్థులకు; 4-0 ప్రాథమిక పాఠశాలా విద్యార్థులకు; సాయంత్రం: 5-30 వి. శశికళ; 5-50 పుల్లెల శేసి సోమయాజులు : వయొలిన్; 6-10 స్థానిక ప్రకటనలు, వాతావరణము; 6-20 గీతమంజరి; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె॥ వా॥); 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 సంగీత శిక్షణ; 7-45 పర్యవసానం (మొదటి అంకము) విదంతకుల సీరియల్ నాటిక రచన : వింజమూరి శివరామారావు; 8-0 వి. శశికళ; 8-30 పుల్లెల శేసి సోమయాజులు : వయొలిన్; 9-0 (ఆం॥వా) 9-15 ఆంగ్ల ప్రసంగం; 9-30 సమాప్తి.

మద్రాసు (బి): 270.8 మీటర్లలో

ఉదయం : 7-0 (తె.వా); 7-15 ఉదయగానము; 7-30 ఎ. సుందరేశన్, మధ్యాహ్నము : 12-0 కార్మికుల కార్యక్రమము ; 12-30 మాధ్యమిక పాఠశాలా విద్యార్థులకు; 1-0 గీతమాలిక; 1-30 (ఆం॥ వా॥); 1-40 గీతమంజరి; 1-50 (తె॥ వా॥); 2-0 సారంగి: నిలయ విద్వాంసుడు; 2-15 ఉన్నత పాఠశాలా విద్యార్థులకు,2-30 తమిళ విద్యార్థులకు; 4-0 ప్రాథమిక పాఠశాలా విద్యార్థులకు; 4-30 పాశ్చాత్య సంగీతం; సాయంత్రము : 5-30 పలని॥ శ. వి. రామస్వామి అయ్యర్; 6-20 సాయం సంగీతము; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె॥ వా॥); 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 మిరియమునుల : విదేశ వ్యాపారము ప్రసంగము, గుమ్మలూరు సత్యనారాయణ; 7-45 అలత్తూర్ సోదరులు; 9-15 నాటిక (తమిళము);9-30 మన్నార్‌గుడి ఎస్. నాగరాజన్;10-0 వాద్యసంగీతం; 10-30 సమాప్తి.

హైద్రాబాద్: 411.0 మీటర్లలో

ఉదయం : 7-0 (తెలు॥వా॥); 7-15 ఎస్. భీమసేనరావు; 7-45 మిరావు సంగీతం; 8-0 (ఆం॥ వా॥), 8-15 వి. పతంకర్; 8-35 శంకరరావు; 8-45 జహీద్ అలీ; 9-0 (ఉ॥ వా॥);మధ్యాహ్నం : 12-30 గీతమాలిక; 12-50 (మ॥ వా॥); 1-0 తుమ్రీ; 1-10 గానాంబుధి; 1-30 (ఆం॥ వా॥); 1-40 గీతలహరి; 1-50 (తె॥ వా॥); సాయంత్రము : 5-30 మహారాష్ట్రమున కార్యక్రమము; 6-0 (ఆం॥ వా॥), 6-10 స్థానిక ప్రకటనలు; 6-15 జహీద్ అలీ,6-25 శంకరరావు, 6-35 వి. వి. పతంకర్; 6-45 గ్రామసీమ; 7-0 (తె॥ వా॥); 7-15 గ్రామసీమ,కణీకరనము జి. లక్ష్మీకాంతయ్య ప్రసంగము; 7-45 (క॥ వా॥); 8-0 (ఉ॥ వా॥); 8-15 విజ్ఞానశాస్త్రము, మానవశైజము డాక్టరు జె. సి. కామేశ్వరరావు ప్రసంగము; 8-30 వి. వి. పతంకర్; 8-50 శంకరరావు, 9-0 (ఆం॥ వా॥); 9-15 (హిం॥ వా॥), 9-30 క. నరసింహరాజులు . వీణ, గాత్రము, 10-15 సమాప్తి.

తప్పిపోయెను

నాతమ్ముడు ఘంటా సుబ్బారావు వయస్సు 28, ఎరుపు, ముఖంగా స్ఫోటకపు మచ్చలు, సన్నగానుండును. కుడి కంటిక్రింద పులిపిరి. సుమారు 25 రోజుల క్రితం గుంటూరువెళ్ళి యిప్పటి వరకు రాలేదు. ఇంట్లోవారందరు మిక్కిలి వేదన పడుచున్నారు. అతని ఆచూకీ తెలిపి, ఇంటికి చేర్చిన వారికి రు 50 లు బహుమానం యివ్వబడును.

ఇట్లు,
ఘంటా హనుమంతరావు
పెదపరిమి (పోస్టు) గుంటూరుజిల్లా

కావలెను

మా కంపెనీలో ఆర్గనైజర్లుగా పని చేయుటకు మంచి పలుకుబడి, సాధ్యముగలవారు కావలెను. మంచిజీతం, ట్రావిలింగు అలవెన్సు యివ్వబడును.

వివరములకు :

CHIRANCO
6368, Mahbub College
Lane, Secunderabad.

నోటీసు

బాపట్ల తాలూకా బోడవాడ గ్రామ కాపురస్థుడు కోట వెంకయ్య కుమార్డు వెంకటేశ్వర్లు తెలియజేయునది యేమనగా :

నా వ్యతిరేకులు 9-8-1952 వ తేదీన రాత్రి నేను పశువుల చావడిలో ఒంటరిగా నిద్రపోవుచుండగా నాకు తెలియకుండా నా ఎడమచేతి బొటన వ్రేలుకు కాటుక పూసి ముద్రవేసుకొని వెళ్ళినారు. నేను లోగడ ఎవరికి,ఏవిధమయిన కాగితములపై బొటన వ్రేలు ముద్ర వేసి యుండలేదు. ఇకముందుగాని, లోగడగాని నాచేవ్రాయబడినట్లు ఏవిధమయిన కాగితములు సృష్టింప బడినను నా జవాబుదారీ యెంతమాత్రం లేదు. చెల్లతగినవి కావు.

కోట వెంకటేశ్వర్లు నిశాని

FOR SALE

For immediate sale - JEEP in excellent condition - neatly maintained with utmost care-regularly serviced-owner driven-all brand new tyres and tubes including stepeny – offers ABOVE Rs, 6250/– will be considered – owner going in for new car – apply to

Sri N Krishnamurthy,
Municipal Chairman,
Narasaraopet.
(Guntur Dt.)

"విశాలాంధ్ర"
మీ ప్రకటనలకు
ప్రధాన సాధనం

'చిన్నరైతులు భూములమ్ముకొని కూడా పన్నులు చెల్లించాలా?'

రాజాజీ తలపెట్టిన అదనపు పన్నుల గురించి శ్రీ వాసిరెడ్డి రామారావు, పిల్లలమర్రిగార్ల ప్రసంగాలు

జుజ్జూరు, ఆగస్టు, 15

"అభివృద్ధిపన్ను పేర శ్రీ రాజాజీ విధించబోతున్న పన్ను 1948 నుండీ సాగుచేసిన భూమిపై ఎకరం ఒకటికి సుమారు రు 750/- వంతున పడుతుంది. దీన్ని 30 సంవత్సరాల్లో చెల్లించుకోవాలట. ఇదేగనక అమలుజరిగితే చిన్న రైతులకు భూములు అమ్ముకునికూడా పన్ను చెల్లించుకోవడంతప్పా గత్యంతరంలేదు" అని శ్రీ వాసిరెడ్డి రామారావు ఎం. ఎల్. ఏ గారు ఆగస్టు 10 వ తేదీన కంచికచర్లలో జరిగిన పెద్ద బహిరంగ సభలో కాంగ్రెసు ప్రభుత్వం విధించబోవు అదనపు పన్నుల గురించి మాట్లాడుతూ అన్నారు. ప్రజల తిండి సమస్య తీవ్రం 'అవుతున్నప్పటికీ కళ్లు మూసుకుని కూర్చుంటున్న రాజాజీ విధానాన్ని ఎత్తిచూపుతూ శ్రీ వాసిరెడ్డి యిల్లా అన్నారు. "ఈనాడు మన తాలూకాలో కరువు ప్రమాదం వచ్చే సూచనలు కనిపిస్తున్నవి. కాని ప్రభుత్వం మాత్రం ఇదేమీ పట్టించుకోవడంలేదు. ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరచి కరువు పనులు ప్రారంభించకపోతే, చౌకడిపోలు వెంటనే తెరవకపోతే భీకర పరిస్థితులు ఏర్పడతాయి. ' ఒకపక్కన ప్రజల సమస్యలను ఈవిధంగా నిర్లక్ష్యం చేస్తున్నది. కాని మావెంట ప్రతిసభకు-సి. ఐ. డీ రిపోర్టర్లను పంపించడంలో మాత్రం రాజాజీ ప్రభుత్వం ఎంతమాత్రం అశ్రద్ధ చేయటంలేదు. రాజాజీప్రభుత్వం యొక్క నిజస్వరూపం తెలుసుకోడానికి ఈ ప్రత్యక్ష ఉదాహరణ చాలు" లన్నారు శ్రీ రామారావు గారు.

అనంతరం శ్రీ పిల్లలమర్రి కృషిక్ లోక్ పార్టీవారి రాజకీయాలగురించి మాట్లాడుతూ-రాజాజీ లేబుసంస్థగా తయారవటంలో కృషిక్‌లోక్ పార్టీ వారు చాలా ముందంజ వేశారని, కమ్యూనిస్టులకు గ్రామీణ ప్రజలలో పొత్తులేదని అనేముందు వారు కాంగ్రెసుతో నెరపుతున్న సహకారంగురించి గ్రామీణ ప్రజలు ఏమనుకుంటున్నారో గ్రహించటం మంచిదన్నారు. ఆంధ్రరాష్ట్ర సిద్ధికి వ్యతిరేకులుగా ఉంటున్న రంగా, సంజీవరెడ్డివంటిగార్లకు ప్రజల్లో స్థానంలేదన్నారు.

సభాధ్యక్షత వహించిన శ్రీ ఇనగంటి నాగేశ్వరరావుగారు నందికొండ, సిద్ధేశ్వరం ప్రాజెక్టులను వెంటనే నిర్మించాలని కోరారు. అదనపు పన్నులు తగ్గించాలనీ, వివాదరహిత ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం నిర్మించాలనీ, తీర్మానాలు గావించబడినవి.

చిత్రహింసలు

భువనగిరి, ఆగస్టు 14

నాయనికుంట అనే భువనగిరి కావి వద్ద అజ్ఞాతవాసం గడుపుతూన్న శ్రీ సుబ్బయ్య అనే కమ్యూనిస్టును 9 వ తేదీన పోలీసులు అరెస్టు చేశారు. అదే రాత్రి ఆయనను హింసిస్తూ గ్రామమంతా త్రిప్పినట్లు, భువనగిరి స్టేషనులో నేటికీ ఆయనను యమయాతనలకు గురిచేస్తున్నట్లు తెలుస్తున్నది. (మా. వి.)

స్వతంత్ర దినోత్సవ సభలు

తెనాలి, ఆగస్టు 15

నేటి సాయంత్రం 7 గంటలకు రణరంగ చౌకులో జిల్లా కాంగ్రెస్ అధ్వర్యాన బహిరంగసభ జరిగింది. సభకు శ్రీ పొన్నూరు సత్యనారాయణగారు అధ్యక్షత వహించారు. శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య ఎమ్. ఎల్. ఎ గారు ఆగస్టు 15 ప్రాముఖ్యతను గురించీ, నందికొండ, పులిచింతల ప్రాజెక్టులు, ఆంధ్రరాష్ట్రంపట్ల వారి సుముఖతను గురించీ మాట్లాడారు. అసెంబ్లీ విశేషాలను గూర్చి మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుండగా ఏర్పడేదా అనే క్లిష్టపరిస్థితులు వచ్చాయనీ, ఎంతో కష్టంమీద వాటిని తట్టుకొని నిలబడగలిగామనీ,ప్రతిపక్షంవారు కాంగ్రెస్‌పై వేస్తున్న అభాండాలు నమ్మవద్దనీ, రాబోవు మ్యునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అన్నివార్డులలోను పోటీ చేస్తున్నదనీ, వారిని మీరంతా గెలిపించాలని కోరుతూ ముగించారు. తరువాత శ్రీ పసుపులేటి క్రిష్ణమూర్తి, మి. భగవంతరావుగార్లు మాట్లాడారు. అధ్యక్షులు సభను ముగిస్తూ ధాన్యం ధర తాత్కాలికంగా పెరిగినా కొద్ది రోజులలోనే మరల తగ్గుతుందని ప్రజలకు హామీయిచ్చారు.

సోషలిస్టుల వక్రభాష్యాలు

తెనాలి పట్టణ సోషలిస్టు పార్టీ అధ్వర్యాన నిన్న సాయంత్రం కోరుల చెట్టువద్ద అగస్టు విప్లవ దినోత్సవ సందర్భంలో బహిరంగ సభజరిగింది. శ్రీ అవుల సుబ్బారెడ్డిగారు అధ్యక్షత వహించారు. విజయవాడ వాస్తవ్యులు శ్రీ వి. కోటేశ్వరరావుగారు ఈ దినోత్సవ ప్రాముఖ్యాన్ని గురించి మాట్లాడుతూ, కమ్యూనిస్టుల చర్యలు దేశద్రోహకరమైనవని పాతపాటే మరోసారి వివరించారు. తరువాత అధ్యక్షులు ఆంధ్రరాష్ట్ర సాధనకు గట్టిగా కృషి చేయాలన్నారు. సభలో కృష్ణా-పెన్నారు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ, నందికొండ, పులిచింతల ప్రాజెక్టులు నిర్మించాలనీ, వెంటనే ఆంధ్రరాష్ట్రం ఏర్పరచాలనీ ఆంధ్రరాష్ట్ర సత్యాగ్రహంలో అరెస్టు చేయబడిన వారిని రాజకీయ ఖైదీలుగా పరిగణించాలనీ తీర్మానాలు అంగీకరించబడినాయి.

వరదన్నపేట రైతులపై దొమ్మీకేసు: గ్రామాలపై పోలీస్ దాడులు మరికొన్ని అరెస్టులు

వరంగల్, ఆగస్టు 15

వరదన్నపేట నియోజకవర్గంలో క్రిష్ణాపురం యిజారాదారుకు మద్దతుగా నిలిచిన పోలీసులు ఇంకా కొన్ని అరెస్టులు చేసినట్లు తెలుస్తోంది. భూములనుండి తొలగ నిరాకరించిన కౌలుదార్లపైకి పోలీసులను పంపి ఈ యిజారుదారు దొమ్మీ చేయించినవిషయం "విశాలాంధ్ర" పాఠకులకు విదితమే. ఇప్పుడా "దొమ్మీ" సందర్భంలో జరిగిన మరికొన్ని అరెస్టుల వివరాలివి.

ఈ దొమ్మీలో పాల్గొన్నారనే ఆరోపణతో కాట్రపల్లిలో ఇద్దరిని, పోతురెడ్డిపల్లిలో నలుగుర్ని మొన్న పోలీసులు అరెస్టు చేశారు.

వరదన్నపేట జోను ఆర్గనైజరు శ్రీ రాఘవరావును అరెస్టు చేయుటకు ఆఫీసుపై దాడిచేసి ఆయన ఆచూకీ తెలియక వదలవలసిందని. అక్కడవున్న కార్యకర్తలను నిర్బంధించినట్లు తెలుస్తోంది. అలాగే శ్రీ బుచ్చిరెడ్డిగారిని కూడా అరెస్టు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

జమీందారీ మూకచే దెబ్బలుతిన్న గాగ్లపాటి నారాయణరెడ్డి గారిని శాసన సభ్యులు శ్రీ గోపాలరావు, హనుమంతరావుగారలు జిల్లా పోలీసు అధికారివద్దకు తీసుకొని వెళ్ళి చూపించగా పోలీసులు ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

అఖిల హైద్రాబాదు రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, శ్రీ గోపాలరావుగార్లు వరదన్నపేట, కిష్టాపురం గ్రామాలకు వెళ్లి అక్కడి వాస్తవిక పరిస్థితులను గురించి విచారణ జరిపారు.

అరెస్టు అయిన శ్రీ మల్లయ్య యాదగి సంఘటన జరిగిన రోజున ఎక్కడో దూరప్రదేశంలో వున్నట్లు, ఈ విచారణవల్ల తేలింది.

కిష్టాపురం, పోతురెడ్డిపల్లి, కాట్రపల్లి గ్రామాల రైతులు కలిసి "దొమ్మీ" చేశారని జమీందారు గోపాలరెడ్డి కేసు పెట్టాడు. గ్రామాలపై పోలీసులు చేసే దాడుల నుండి తప్పించుకోవడానికి ప్రజలు గ్రామాలు వదిలి పెట్టి పోతున్నారు. (మా. వి.)

కల్లుగీత పారిశ్రామికుల ప్రదర్శనలు

సూర్యాపేట, ఆగస్టు 13

నిన్నరాత్రి రెండువందలమంది కల్లుగీత పారిశ్రామికులు సూర్యాపేటలో ఊరేగింపు జరిపారు. ఆబ్కారీ అధికారుల దౌర్జన్యాలు నశించాలని, ముస్తాజర్ల ముహాఫ్జాలు (లా భా లు) ఆపుచేయాలని, చీలున్న చోట్ల కల్లు అమ్ముకొనే అవకాశ మివ్వాలని, బ్లాక్ నెంబరు తాళ్ళకు ప్రభుత్వం విచారించాలని, గూప్పునిష్టం రగ్గు చెయ్యాలని, జప్తులు, డిక్రీలు, ఆపాలని నినాదాలిస్తూ ముఖ్యవీధులగుండా ప్రదర్శనలు జరిపారు. (మా. వి.)

గమనిక

"విశాలాంధ్ర" పత్రికకు టెలిగ్రాములుపంపగోరువారు 'VISALANDRA' విజయవాడ అని వ్రాయాలి.

మేనేజరు,
విశాలాంధ్ర

తిరుగుబాటు దారులకు మరణ శిక్షలు

జనరల్ నజీబ్ నిరంకుశ ధోరణి

కైరో, ఆగష్టు 16

అలెగ్జాండ్రియా కార్మికుల తిరుగుబాటు సందర్భంలో అరెస్టయినవారిని మిలిటరీ కోర్టు ఈ రోజల్లా విచారణ చేస్తూనే వుంది. సోమవారంనాడు తీర్పు వెలువడుతుంది.

నెలకు 8 పౌనుల వేతనంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఖామిస్ అను 20 సంవత్సరాల వయస్సుగల కార్మికుడు, ఈ తిరుగుబాటుకంతా మూలమనీ, అతనికి మరణశిక్ష విధించాలనీ, మిలిటరీ కోర్టు సూచించింది. జనరల్ నజీబ్ అంగీకారం లభించిన మీదట ఈ తీర్పు అమలుజరుపబడుతుంది. మరి 27 గురు కార్మికులకు కూడా మరణశిక్ష విధిస్తారని రూఢిగా తెలుస్తున్నది.

స్థానిక పోలీసు ఉద్యోగుల ననేకులను ప్రభుత్వం బర్తరఫు చేసింది. మొత్తం అరెస్టు చేయబడ్డ 600 మందిలో, 545 గురు విడుదల చేయబడ్డారు. మిగతా వారిపై నేర విచారణ సాగుతున్నది.

ప్రభుత్వం తరఫున సాక్షులుగా, 88 గురు హాజరైనారు. బట్టల మిల్లు మేనేజింగ్ డైరెక్టరు ఇందులో ఒకడు. గత పది సంవత్సరాలలో తన ఫ్యాక్టరీ కార్మికులు ఎన్నడూ సమ్మె చేయలేదనీ, వారికెట్టి అసౌకర్యాలు లేవనీ, ఆ మిల్లు యజమాని తెలియజేసాడు. ఎవరో రాజకీయవాదుల ప్రోత్సాహం వల్లనే ఈ తిరుగుబాటు జరిగివుంటుందని తాను భావిస్తున్నానన్నాడు.

ఈ మిల్లు పోలీసు అధికారి, సాక్ష్యమిస్తూ 10,500 ఒక్కుమ్మడి తిరుగుబాటుచేసిన ఫలితంగా తన పోలీసు బలగమంతా నిరుపయోగమైందని తెలియజేశాడు.

కమ్యూనిస్టులపై దాడి

ఒక కమ్యూనిస్టు ఆఫీసుపై పోలీసులు దాడిచేసి పదిమంది కార్మికులను అరెస్టుచేశారు. సి. ఐ. డి. పోలీసుల సమాచారాల ననుసరించి తామీ దాడి జరిపామని అధికారులు తెలియజేశారు.

అల్లరులను ప్రోత్సహించారనే నేరంతో, అలెగ్జాండ్రియాలోని స్థానిక రాజకీయపార్టీ నాయకుల ననేకులను పోలీసులు అరెస్టుచేశారు. వాఫ్ట్ పార్టీ స్థానిక కమిటీ అధ్యక్షుడు కూడా అందులో ఒకడు.

సుడాన్ సంప్రతింపులు

ఈజిప్టు - సుడాన్ సంప్రతింపులు కాలనిర్ణయం లేకుండా వాయిదా వేయబడ్డాయి. ప్రధాని మెహర్ పాషా, జనరల్ నజీబ్‌తో సంప్రతించినమీదట ఈజిప్టులోని రాజకీయ పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి సంభాషణలు వాయిదా వేశామని తెలియజేశాడు.

సుడాన్ ప్రతినిధివర్గం కొద్ది రోజులుగా, కైరోలో సంప్రతింపులు సాగించి, స్వదేశానికి తిరిగి వెళ్ళింది స్నేహపూర్వక చర్చలు కొనసాగాయని మాత్రం ప్రతినిధివర్గ నాయకుడు తెలియజేసాడు. నామమాత్రంగానైనా ఈజిప్టు రాజు ఆధిపత్యాన్ని అంగీకరించటానికి వీరు ఇష్టపడలేదని రూఢిగా తెలుస్తున్నది. బ్రిటన్ మొట్టమొదటి సారిగా కొన్ని ఆయుధాలను ఈజిప్టుకు సప్లయిచేయటానికి అంగీకరించింది.

సిరియా, లెబనాన్‌లు

లెబనాన్ దేశంలో కూడా కొద్ది రోజులలో ఈజిప్టులోవలెనే సైనిక తిరుగుబాటు జరగగలదని 'అల్ మిస్రీ' అను పత్రిక వ్రాసింది. సిరియా సైన్యాధ్యక్షుడు షిష్క్లీ ఈజిప్టుఘటనలపై వ్యాఖ్యానిస్తూ, జనరల్ నజీబ్, "ప్రపంచ వీరులలో ప్రప్రథముడు" అని అభినందించాడు.

శ్రీ శిబన్‌లాల్ సాగ్జేనా నిరశనవ్రతం

గోరఖ్‌పూర్, ఆగష్టు 16

ఉత్తరప్రదేశ్ - తూర్పు ప్రాంతంలోని 11 జిల్లాలలో ఆహార క్లిష్ట పరిస్థితిపై వాస్తవానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనకు నిరసనగా ప్రజాపార్టీ నాయకుడు శ్రీ శిబన్‌లాల్ సాజ్జేనా నేడు యిచ్చట నిరశనవ్రతం ప్రారంభించారు.

ఆ 11 జిల్లాలలోని ఆహారకొరతపైన యిటీవల జరిగిన సంఘటనలపైన, విచారణ జరిగేందుకు శ్రీ జె. సి. కుమారప్ప, మష్రువాలా, ఆచార్య వినోబాభావేల్లతో ఒక కమిటీని ప్రభుత్వం నియమించాలని ఆయన కోరారు.

భారత - పాకిస్తాన్‌ల మధ్య ప్రయాణం

పాస్‌పోర్టు పద్ధతిని వివరిస్తూ ప్రకటన

కరాచీ, ఆగష్టు : 16

భారత పాకిస్థాన్ దేశాల మధ్య పాస్‌పోర్టు పద్ధతి అక్టోబరు 15 వ తేదీ, నుండి అమలులోకి వస్తుంది. ఈవిషయమై, పాకిస్థాన్ ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటన, చట్టంలోని వివరాలన్నిటినీ తెలియజేసింది.

భారతదేశంలోనుండి పాకిస్థాన్‌లో ప్రవేశింపగోరు ప్రయాణీకు లందరినీ, ఆరు తరగతులుగా విభజిస్తారు. ప్రభుత్వ వుద్యోగస్థులు, వ్యాపారస్థులు, పాకిస్థాన్‌లో ఆస్తిపాస్తులు గల వారు, తదితరులు.

ఇంతకు పూర్వమువలె కాకుండా, ఒక్కొక్క తరగతివారి దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించి, ఉత్తరువులు జారీచేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం ప్రత్యేక సిబ్బందిని నియమించింది.

ఇంతకు పూర్వమే పాకిస్థాన్‌లో నివసిస్తున్న వారు సైతం నూతన చట్టం ప్రకారం అనుమతి పత్రాలను పొందవలసివుంటుంది.

డా. రాధాకృష్ణన్‌కు కాశ్మీర్ స్వాగతం

శ్రీనగర్, ఆగష్టు 16

భారత రిపబ్లిక్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణన్ ఈవేళ యిక్కడకు ఢిల్లీనుండి రాగానే శ్రీనగర్ పౌరులు ఆయనకు ఘనమైన స్వాగతం యిచ్చారు. కాశ్మీర్ ప్రధాని షేక్ అబ్దుల్లా ఆహ్వానించారు.

సాయంత్రం ఉపాధ్యక్షుడిని పెద్ద ఊరేగింపుతో తీసుకొని వెళ్ళారు.

డాక్టర్ రాధాకృష్ణగారు సోమవారంనాడు కాశ్మీర్ విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసం యిస్తారు.

ఆ రోజునే జమ్మూ-కాశ్మీర్ విశ్వవిద్యాలయ భవనానికి శంకుస్థాపన చేస్తారు.

మంగళవారం తిరిగి ఢిల్లీ చేరుకొంటారు.

సారవాక్‌లో బ్రిటిష్ దురంతాలు

కూచాంగ్, (సారవాక్) ఆగష్టు 16

ఇండోనేషియనుల చేతులలో వున్న పడమటి బోర్నియోనుంచి సారవాక్‌కు రాకపోకలు బంద్ చేయబడినాయి. కమ్యూనిస్టు నాయకులు పడమటి బోర్నియోలో ప్రధాన కార్యాలయం పెట్టుకొని సార్వాక్‌లో తిరుగుబాట్లను నడుపుతున్నారని వారి అనుమానం.

ఉండకూడనివారు అనే నెపంతో నేడు అయిదుగురు చైనీయులను అరెస్టుచేసి ప్రభుత్వం బందోబస్తుక్రింద చైనాకు పంపివేస్తోంది.

చైనావారంటే ద్వేషభావం ప్రకటించే సముద్రపు డ్యాకులనే ఆటవికులను కమ్యూనిస్టు విప్లవాన్ని అణచడం పేరుతో చైనా ప్రజలపై వుపయోగిస్తూన్నారు. మనుష్యుల పుర్రెలను సంగ్రహించడం పరాక్రమానికి చిహ్నంగా భావించి చిన్న, పెద్ద, స్త్రీ, పురుష భేదంలేకుండా కనిపించిన వారందరినీ నరికి చంపే ఆటవికజాతి ఈ సముద్రపుడ్యాక్‌లు. వీరినే మలయాలో కూడా బ్రిటిష్‌సామ్రాజ్యవాదులుపయోగించి వైఫల్యం పొందారు. తాము పుట్టిన దేశంలో వారు ఎక్కువ పని చేయగలరని బ్రిటిష్‌వారి యాశ.

ఈ సముద్రపు డ్యాకులకు మరొక పేరు 'ఇబన్'లు. వీరు బోర్నియో వాసులు.

యుగోస్లోవియాలో కాటకం

బెల్గ్రేడ్ ఆగష్టు 16

యుగోస్లోవియా దేశంలో తీవ్రమైన కాటకపరిస్థితు లేర్పడ్డాయి. గత రెండేడ్లలో ఇంతటి తీవ్రపరిస్థితు లేర్పడడం ఇది రెండవసారి.

అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రత 118 డిగ్రీలవరకూ వుంది. జొన్న పంట సగటు ఉత్పత్తికి 40 వంతులు, గోధుమ పంట సగటు ఉత్పత్తికి 20 వంతులు, తగ్గింది. దేశమంతటినుండీ ఇట్టివార్తలు వస్తున్నాయి.

ఈ కాటకపరిస్థితి, దేశార్థికవిధానాన్ని తీవ్రంగా కల్లోలపరుస్తుందని భావించబడుతున్నది.

ఆచార్య వినోబాభావే

కాశీ, ఆగష్టు 16,

ఆచార్య వినోబాభావే రెండు రోజులనుండి జ్వరంతో బాధపడుతున్నారు. అందువలన ప్రార్థనా సమావేశాలు ఈ రెండు రోజులుగా జరుగలేదు.

దక్షిణాఫ్రికా సత్యాగ్రహులకు కొరడా దెబ్బలు

ఖైదీలపై జైలువార్డర్ల దురాగతాలు

జోహాన్స్‌బర్గ్, ఆగష్టు 16

పోర్టుఎలిజబెత్‌లో 96 గురు వాలంటీర్లు అరెస్టు అయినారు. జూన్ 26 న ఉద్యమం ప్రారంభమైన నాటినుండి నేటికి మొత్తం అరెస్టులు 2263.

వీరుగాక 20 మంది ప్రముఖ నాయకులు అరెస్టయినారు.

సత్యాగ్రహులకు కొరడా దెబ్బలు విధించవలసిందిగా పోర్టు ఎలిజబెత్ మాజిస్ట్రేటు నేడు తీర్పు యిచ్చాడు. ఇలా శిక్ష విధించడం ఇదే మొదటిసారి.

అమానుషమైన ఈ శిక్షావిధానానికి నిరసనగా దేశమంతా వుద్యమాన్ని వ్యాపింప చేస్తామని సత్యాగ్రహ నాయకులు తెలియజేసారు.

డాక్టర్ మొరార్కా అరెస్టు ప్రజలలో విపరీతమైన ఆందోళన కలిగిస్తున్నది. అరెస్టువార్తను తెలియజేస్తూ, వీధి గోడలనిండా కాగితాలు అంటించబడ్డాయి. ఈయన అరెస్టుతో ఉద్యమం మరింత తీవ్రతరమయ్యే చిహ్నాలగుపిస్తున్నాయి.

మాజీ పార్లమెంటు సభ్యుడు సామ్‌ఖాన్ అరెస్టయిన వాలంటీర్ల తరఫున కోర్టులో వాదిస్తున్నాడు.

ఖైదీలను వార్డర్లు బాధిస్తున్నారనీ, ఏదో నెపంతో కొడుతున్నారనీ, కోర్టులో ఆరోపించాడు. ఆ విషయమై వెంటనే విచారణ జరపవలసిందని కూడా సామ్‌ఖాన్ కోరాడు.

Edited, Printed & Published by
Katragadda Rajagopala Rao
at Swatantra Art Printers,
of Swatantra Concerns Ltd,
Buckinghampet, Vijayawada - 2

నేపాల్ ఘటనలకు బాధ్యత

నాయకుల పరస్పరారోపణలు

ఖాట్మండూ, ఆగష్టు 16

నేపాల్ రాజు త్రిభువన్ విక్రమ తన సలహాసమితి సభ్యులందరికీ, వివిధ శాఖలను విభజించాడు. నేపాలీ కాంగ్రెసు సభ్యులకొందరూ, రాణాల సంస్థయిన రాష్ట్రీయవాది పరిషత్, నేపాలీ ప్రజా కాంగ్రెసు, త్రిభువన్‌రాజు పరిపాలనను బలపరుస్తూ ప్రకటనలు గుమ్మరిస్తున్నారు.

తిరిగి కాంగ్రెసువారు అధికారంలోకి రావటానికి ప్రయత్నిస్తారని, అట్టి ప్రయత్నాలను రాజు ధైర్యంతో ఎదుర్కోవాలని, రాణాల సంస్థ, రాష్ట్రీయవాది పరిషత్ హెచ్చరించింది.

నేపాలీ ప్రజా కాంగ్రెసు తరఫున మాజీమంత్రి భద్రకాళీ మిశ్రా ఇలా అన్నాడు. "ప్రజాస్వామ్య పరిపాలన స్థాపించటానికి జరిగిన ప్రథమప్రయత్నం విఫలం కావటం విచారకరం. కోయిరాలా సోదరుల, అధికారతృష్ణ, దురాశలకు, ప్రజాస్వామ్యం బలికావించబడ్డది, రాజు పరిపాలనద్వారా శాంతి భద్రతలు స్థిరపడి, తిరిగి ప్రజాస్వామ్యస్థాపనకు అనుకూలమైన పరిస్థితులేర్పడతాయని ఆశిస్తున్నాను."

నేపాలీ జాతీయ కాంగ్రెసులో ఒక ముఠాకు నాయకుడైన ఋషీకేశ్ షా, నేటి పరిస్థితిలో రాజుపరిపాలన దేశానికి క్షేమకరమన్నాడు.

కాంగ్రెసువారి చేతులలో ఇప్పటికీ ఆయుధాలున్నవి. పరిపాలనా యంత్రంలో కొంత భాగం వారి వశంలో వుంది. కనుక తిరిగి మరొక కల్లోలాన్ని వారు ప్రోత్సహించవచ్చునని కూడా ఋషీకేశ్ షా హెచ్చరించాడు.

టెరై రాష్ట్రంలోని రైతుపోరాటాలను, స్వార్థప్రయోజనాలతో కే. పి. కోయిరాలా ప్రోత్సహించాడని, గూర్ఖాపరిషత్ ఆరోపించింది.

ప్రజా క్షేమాలకై బ్రిటిష్ కంపెనీల స్వాధీనం

చైనా ప్రభుత్వ చర్యకు ప్రజల హర్షం

హాంగ్‌కాంగ్, ఆగష్టు 16

బ్రిటిష్ కంపెనీకి చెందిన షాంఘై డాక్‌యార్డులను, మొల్లర్సు కంపెనీకి చెందిన షిప్‌యార్డులను (నౌకలను నిర్మించి, బాగుచేసే కార్ఖానాలు) చైనీస్ మిలిటరీ కంట్రోల్ కమిషన్ (షాంఘై) స్వాధీనం చేసుకొన్నట్లు పెకింగ్ రేడియో తెలుపుతూంది.

"చైనా ప్రజానీకంయొక్క క్షేమలాభాలను వుద్దేశించి" ఈ విధంగా స్వాధీనపరచుకోవడం జరిగిందని పెకింగ్ రేడియో వ్యాఖ్య.

షాంఘై డాక్‌యార్డ్సు కంపెనీ, అసిస్టెంటు మానేజరును, మొల్లర్ షిప్ బిల్డింగ్ అండ్ ఇంజనీరింగ్ కమ్పెనీ మేనేజరునూ విదేశీయుల వ్యవహారాలను చూసే శాఖ కార్యాలయానికి పిలిపించి ఈ ఆజ్ఞను చదివి వినిపించారు.

ఒక గంట పోయినాక మిలిటరీ కంట్రోల్ కమిషన్ ప్రతినిధులుగా వెళ్ళిన షెంగ్‌వాంగ్, హాంగ్ సుంగ్ షెనేన్‌లకు షాంఘై డాక్‌యార్డు కార్మికులు మహోత్సాహంతో స్వాగతమిచ్చారు.

ఈ స్వాధీనోత్సవాన్ని జరిపేటందుకై కార్మికులు పెద్ద బహిరంగ సభ జరిపారు. కంపెనీ సామానులను, ఆస్తులను లెక్కతేల్చడంలోనూ, సంరక్షించడంలోనూ పూర్తిగా తోడ్పడతామని కార్మికులు సభలో ప్రతిజ్ఞలు తీసుకొన్నారు. పనులు ఆగిపోకుండా జరుగునట్లు చర్యలు తీసుకోంటామని హామీలనిచ్చారు.

మొల్లర్ కంపెనీ కార్మికులుకూడా ఇదేవిధంగా సభలుజరిపి కంట్రోల్ కమిషన్ ప్రతినిధులను ఆహ్వానించి, వారియెదుట ప్రతిజ్ఞలు తీసుకొన్నారు.

షాంఘై హార్బరులో నాలుగు 'డ్రైడాక్‌'లను షాంఘై డాక్‌యార్డ్సు కంపెనీ నిర్వహిస్తూంది.

చైనా ప్రజా ప్రభుత్వంయెడ బ్రిటిషు సామ్రాజ్యవాదులు తీసుకొంటూన్న వ్యతిరేక దృక్పథం ఈ డాక్‌యార్డుల పని నిర్వహణలో కూడా ప్రతిబింబిస్తూన్నది. నౌకల మరమ్మతులు శీఘ్రంగాంజరగకుండాఏవో కొన్ని ఆటంకాలు తెస్తూన్నారు. సామ్రాజ్యవాదుల దుష్ప్రయత్నాలను అరికట్టి నౌకానిర్మాణ కేంద్రాలు చైనా ప్రజానీకానికి లాభకరంగా వుపయోగపడునట్లు చేయడానికై చైనా ప్రజా ప్రభుత్వం ఈ చర్య తీసుకొంది.

చైనా విమానాలు నలభయ్యింటిని అమెరికను, కంపెనీకి స్వాధీనపరుస్తూ ప్రీవీకౌన్సిలు (బ్రిటిషు) యిచ్చిన తీర్పుకు ప్రతీకారంగా యీ చర్యకు పూనుకొన్నట్లు హాంగ్‌కాంగ్‌లో తలచబడుతూంది. మొదట హాంగ్‌కాంగ్ కోర్టులు ఆ విమానాలు చైనావేనని తీర్పు యిచ్చాయి.

అ॥ భా॥ పత్రికా సంపాదకుల సభ

కార్యదర్శి ప్రకటన

నాగపూర్, ఆగష్టు 16

అఖిలభారత పత్రికా సంపాదకుల మహాసభ సెప్టెంబరు 16, 17 తేదీలలో జరుపుటకు ఆహ్వాన సంఘం నిర్ణయించింది. తీర్మానాలు ప్రతిపాదించదలచినవారు సెప్టెంబరు 10 వ తేదీ లోపుగా తమ తీర్మానాలను అ॥ భా॥ పత్రికా సంపాదక సంఘ కార్యదర్శి, 50/51, కన్నాట్ వీధి, న్యూఢిల్లీకి పంపాలని గౌరవ కార్యదర్శి కోరుతున్నారు.

మైసూరులో క్షామపరిస్థితి

బెంగుళూరు, ఆగష్టు 16

వర్షాభావం ఫలితంగా మైసూరు రాష్ట్రంలో పరిస్థితులు దెబ్బతిన్నవి. అనేక ప్రాంతాలలో క్షామ. పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని చర్చించేందుకు ముఖ్యమంత్రి వచ్చేవారం ఢిల్లీకి వెళ్ళున్నారని నేడిక్కడ ప్రకటించబడింది.

మిర్జాపూర్ జిల్లాలో వరదబాధితుల కడగండ్లు

లక్నో, ఆగష్టు 15

మిర్జాపూర్ (ఉత్తరప్రదేశ్) జిల్లాలో సోనే నది వరదల ఫలితంగా మిగతా ప్రాంతంతో వేరుచేయబడిన ప్రాంతానికి ప్రభుత్వం డకోటా విమానాలద్వారా ఆహారధాన్యా లందజేస్తోంది.

తూర్పు జిల్లాలో ఆహారపరిస్థితి అత్యంత క్లిష్టంగావున్నందున అచ్చటకు 8 వేల మణుగుల ధాన్యం రైళ్ళద్వారా పంపుటకు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇందుకోసం ప్రభుత్వం 7 రైళ్ళను వినియోగించుతోంది.

షాజహాన్ పూర్‌లో విద్యార్థుల ప్రదర్శనం

షాజహాన్ పూర్, ఆగష్టు 16

గత గురువారంనాడు స్థానిక ప్లీడరు శ్రీ అష్ఫక్ ఆలీఖాన్ అభ్యంతరకరమైన ప్రసంగం చేశాడనే ఆరోపణపై పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. దీనికి నిరసనగా విద్యార్థులు యీ రోజు నగర వీధులలో ప్రదర్శన చేశారు.

భారతదేశంనుండి నూలు ఎగుమతి

బొంబాయి, ఆగష్టు 16

భారతదేశంనుండి యీ సంవత్సరం జూలై - డిసెంబరు మాసాల మధ్య బిర్మాకు 805 బేళ్ళ నూలు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఒక్కొక్క వ్యాపారి 50 బేళ్ళు ఎగుమతి చేయవచ్చును. ఎగుమతిదారుల జాబితా బిర్మా రాయబారికి అందచేయబడిందని ఒక ఉద్యోగి అన్నాడు.

61 వేల పత్తి రద్దు ఎగుమతికికూడా ప్రభుత్వం అంగీకరించింది.

ఎలాంటి పరిమితి లేకుండా పోలెండుకు జనపనార ఎగుమతికికూడా ప్రభుత్వం అనుమతించిందని పై ఉద్యోగి వెల్లడించాడు.

పాట్నా జిల్లాలో అరెస్టులు

కలెక్టర్ ఆఫీసుముందు ప్రదర్శనలు జరిపినందుకు

పాట్నా, ఆగష్టు 16

మసౌరీ తానా (పాట్నా జిల్లా) కు చెందిన ఏనిమిదిమంది నిన్న ఊరేగింపు చేసినందుకు అరెస్టు చేయబడ్డారు. మసౌరీ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండు చేస్తూ సోషలిస్టుపార్టీ నాయకత్వాన వారు జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు ప్రదర్శనలు చేశారు.

ఈవిధంగా ప్రదర్శనలు జరిపిన వారిని యింతకుముందు 28 గురిని అరెస్టుచేశారు.

సంయుక్త మహారాష్ట్ర నిర్మాణావశ్యకత

★

అమరావతీ మహాసభలో శ్రీ వి. డి. దేశపాండే ఉద్ఘాటన

'హైద్రాబాద్ విభజనే కీలక సమస్య'

అమరావతి, (మధ్యప్రదేశ్) ఆగష్టు 16

"దక్షిణ భారతంలో భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి హైద్రాబాద్ సంస్థాన విభజన కీలకం, అందువల్ల దానికి అన్నింటికంటే ప్రాధాన్యత నివ్వాలి." అని ఈవేళ యిక్కడ ప్రారంభమైన సంయుక్త మహారాష్ట్ర మహాసభకు అధ్యక్షత వహించుతూ, హైద్రాబాద్ శాసనసభా ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే అన్నారు.

సంయుక్త మహారాష్ట్ర మహాసభ యీవేళ రాత్రి యిక్కడ శ్రీ దేశపాండే అధ్యక్షతన ప్రారంభమైంది. అఖిలభారత భాషారాష్ట్రాల మహాసభకు వచ్చిన ప్రతినిధులుకూడా ఈ సభకు హాజరయ్యారు.

శ్రీ దేశపాండే తన అధ్యక్షోపన్యాసంలో యిలా అన్నారు:

బొంబాయి మహారాష్ట్ర, మరాట్వాడా (హైద్రాబాద్) మహావిదర్భ, గోవాలతో సంయుక్త మహారాష్ట్రం ఏర్పడాలి. అందువలన దీనికి కూడా హైద్రాబాద్ సంస్థాన సమస్య పెద్ద అడ్డంకిగా తయారై కూర్చున్నది. వెనువెంటనేచేరడానికి సిద్ధంగావున్న ప్రాంతాలలో ప్రస్తుతానికి భాషారాష్ట్రంగా ఏర్పరచాలి. వివాద ప్రాంతాలు తరువాత ప్రజాతంత్రయుతంగా ఐక్యమహారాష్ట్రంలో చేరగలవు. ఈలోపువ వివిధ భాషలుగల రాష్ట్రాలనుండీ అవి ముందు బయటు పడవలసివుంది.

హైద్రాబాద్ విభజన అందరికీ అంగీకారమే

హైదరాబాదులో ఒక్క నైజాం ప్రభుత్వం తప్ప ప్రతిఒక్కరూ సంస్థాన విభజనను కోరుతున్నారు. కాంగ్రెసుకు కొద్ది మెజారిటీగల హైద్రాబాద్ శాసనసభ సహితం రిఫరండం తీసుకొంటే విభజనకే ఓటుచేసి తీరుతుంది. హైద్రాబాద్ సంస్థానాన్ని ప్రజల కోర్కె ననుసరించి విభజించడానికి బదులు కేంద్రప్రభుత్వం ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని దానిలో హిందీని ప్రవేశపెడుతోంది. దీనిభావం ఏమిటి? వారు హైద్రాబాద్‌ను యథాతథంగా వుంచడమో లేదా హైద్రాబాద్ నగరాన్ని తర్వాత కేంద్రప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమో చేస్తారని అనుమానమవుతున్నదికాని ప్రజలుగట్టిగాడిమాండుచేస్తే కాంగ్రెసు ప్రజాభిప్రాయానికి తలొగ్గి తీరవలసి వస్తుంది. ఈ సందర్భంలో కాశ్మీర్ మనకు మార్గం చూపెడుతోంది."

ఐచ్ఛికంగానే ఐక్యత

దేశపాండే తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వివిధప్రాంతాలు ఐచ్ఛికంగా యిష్టపడటం మూలంగానే సంయుక్త మహారాష్ట్రం ఏర్పడగలదన్నారు. "ఈనాడు వివిధ ప్రాంతాలు వివిధ పరిపాలనాప్రాంతాల్లో విభజించబడ్డాయి. అన్ని ప్రాంతాలూ ఐక్యంకావాలని ఎలాంటి నిర్బంధం పెట్టరాదు. అందరూకలసి ఒకరాష్ట్రంలో వుండవలసిన ఆవశ్యకతను గురించి వారు గుర్తించేటట్లుచేయాలి.

వెంటనే బొంబాయి మహారాష్ట్ర మహావిదర్భలతోకూడిన మహారాష్ట్రం ఏర్పడవచ్చు. అందుకవసరమైన తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవచ్చు. బొంబాయి నగరంకూడా మహారాష్ట్రలోని భాగమే. నగరంచుట్టూ మరాఠీ భాష మాట్లాడే ప్రజలే వున్నారు. బొంబాయి నగరంలో మరాఠీ భాష మాట్లాడే ప్రజలు ముఖ్యంగా కార్మికులు, మధ్యతరగతిప్రజలూ, మహారాష్ట్రంలో నగరం ఉండటం ఎలా న్యాయసమ్మతమో, నగరంలో వున్న తతిమ్మా మైనారిటీలకు నచ్చచెప్పవలసి వుంది. మైనారిటీల హక్కులు సురక్షితంగా కాపాడబడతాయనే హామీ నివ్వాలి. మొట్టమొదట వివాద రహిత ప్రాంతాలు కలసి ఒక రాష్ట్రంగా ఏర్పడితే వివాదంలో కూడుకొన్న ప్రాంతాలవారు ప్రజాస్వామిక పద్ధతులద్వారా ఆ తరువాత చేరవచ్చు."

నగరాలను కేంద్రం క్రిందకు తీసుకోరాదు

పెద్ద నగరాలను కేంద్ర పాలన క్రిందకు తీసుకోవాలన్న సూచనను శ్రీ దేశపాండే నిరాకరిస్తూ అలాజరిగితే రాష్ట్రాల్లో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు రాష్ట్రాల్లో లేకుండాపోయి ప్రమాద పరిస్థితులకు దారితీస్తుందని హెచ్చరించారు.

మధ్యప్రదేశ్ మాజీమంత్రి, ఆహ్వాన సంఘాధ్యక్షుడూ అయిన డాక్టర్ యస్. యమ్. హసాన్ ప్రతినిధులను ఆహ్వానిస్తూ అంతకుముందు ప్రసంగించారు.

మధ్యప్రదేశ్‌లో భాండారా జిల్లాలోని గోండియానుండి పశ్చిమ తీరంలోవున్న గోవావరకూగల మరాఠీ భాష మాట్లాడే ప్రాంతమంతా బొంబాయినగరంతోసహా సంయుక్త మహారాష్ట్రంలోకి రాగలదని డాక్టర్ హసాన్ అన్నారు. గోవా, మరాఠీ మాట్లాడే హైద్రాబాద్ ప్రాంతం, బొంబాయినగరంలేని మహారాష్ట్రాన్ని ఎవ్వరూ ఆమోదించలేరని హసాన్ అన్నారు భాషారాష్ట్రాల నిర్మాణాన్ని ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని తీవ్రముగా విమర్శించారు.

ఐక్య ఉద్యమావశ్యకత

తంతి, తపాలాపనివారలసంఘవార్షికోత్సవం

మదరాసు, ఆగష్టు 14

యూనియన్ ఆఫ్ పోస్టు అండ్ టెలిగ్రాఫ్ వర్కర్సు రజత వార్షికోత్సవం నిన్న శ్రీ యం. ఎ. జబ్బార్‌గారి అధ్యక్షతను ఇక్కడ జరిగినసందర్భంలో ఐక్య ఉద్యమావశ్యకత గురించి పలువురు వక్తలు మాట్లాడారు. శ్రీ టి. వెంకట్వరాయన్ గారు (కాంగ్రెసు) 'ప్రపంచ కార్మికులారా ఏకముకండు' అనే నినాదాన్ని మున్ముందు భారత కార్మికులు, పోస్టు అండ్ టెలిగ్రాఫ్ కార్మికులు అమలుచేయటం అవసరమన్నారు.

మద్రాసు యూనియన్ కార్యదర్శి శ్రీ ఎ. యస్. రాజన్‌గారు మాట్లాడుతూ పోస్టలు అండ్ టెలిగ్రాఫ్ వర్కర్సు యూనియన్లు మూడు ఐక్యమై ఒకే ఒకయూనియనుగా ఏర్పడిన 1941 ఆగష్టు 18 వ తేదీ మరుపురాని దినం అన్నారు. కాని కేంద్ర వేతన నిర్ణాయకసంఘం ఎదుట పనివారి వేతనాలు గురించి కొన్ని యూనియన్లు రు80/-అనీ, మరికొన్ని రు100/-ఉండాలనీ, చెప్పాయి. ఈవిధంగా ఐక్యత లోపించటంవల్లనే మనం అధికవేతనాలు సాధించలేక పోయాము అన్నారు. అందుచేత పోస్టు అండ్ టెలిగ్రాఫ్ వర్కర్లు ఐక్యంగా పనిచేయాలని కోరారు.

శ్రీ పి. రామమూర్తి ఎం. ఎల్. ఎ. గారు మాట్లాడుతూ, కార్మికుల జీవన వ్యయప్రమాణం పెరిగినా, జీవన భృతి పెంచుటకు ప్రభుత్వం నిరాకరించుతున్నదన్నారు పి. కె. భుజంగరావుగారు, పరిపూర్ణంగారు మాట్లాడుతూ, తగినంత స్టాఫ్ లేదనీ, పని భారం తగ్గించటానికి వెంటనే అదనంగా స్టాఫును పెంచాలని అన్నారు. కో ఆర్డినేటింగ్ కమిటీ కార్యదర్శి శ్రీ జి. లక్ష్మన్‌గారి అభివందనాలతో సభ ముగిసింది.

సబ్బుల పరిశ్రమలో తీవ్రమైన దుస్థితి

ఎగుమతులు, వినియోగం తగ్గడంవల్లన

బొంబాయి, ఆగష్టు 17

భారతదేశంలో సబ్బుల పరిశ్రమ నేడు క్లిష్టపరిస్థితిలోవుందని, దేశంలో సబ్బుల వినియోగం తగ్గిపోవడంవలన ఎగుమతులు చెప్పుకో తగినంతగా లేనందువలన ఉత్పత్తి పడిపోయిందని, ప్రముఖ సబ్బు పరిశ్రమదారులు తెలియజేస్తున్నారు.

కుటీర పరిశ్రమల ప్రాతిపదికపై సబ్బులు తయారుచేసేవారు సర్వనాశనమయ్యే స్థితిలో ఉన్నారని వీరు అంటున్నారు.

సబ్బుల ఎగుమతిపై అనేక యూరపియన్ దేశాలు విధించిన నిషేధంవల్ల మనదేశంనుంచి సబ్బుల ఎగుమతి పడిపోయిందట. సబ్బులకన్నా, సబ్బుల తయారీకి అవసరమయ్యే ముడి పదార్థాలే విదేశీయుల తెప్పించదలుచుకున్నారట.

నూనెధర పెరిగిపోవటం కూడా సబ్బుల ఉత్పత్తి పడిపోవడానికి ఒక కారణం. దిగుమతి అయ్యే కొబ్బరి నూనెపై ప్రభుత్వం పన్ను కొంతతగ్గించినప్పటికీ, టారిఫ్ డ్యూటీ హెచ్చించినందువలన దీనివల్ల వ్యాపారస్థులకేమీ వుపయోగం లేకుండాపోయింది.

భాషారాష్ట్రాల మహాసభ

విషయనిర్ణయ కమిటీ సమాలోచనలు

అమరావతి, ఆగష్టు 16

అఖిలభారత భాషారాష్ట్రాల మహాసభ విషయనిర్ణయ కమిటీ ఈవేళ డాక్టర్ లంకా సుందరం అధ్యక్షతన రెండుగంటలపాటు సమావేశమై ముసాయిదా తీర్మానాల్లో ఏ యే అంశాలను తీసుకొనిరావాలో చర్చించింది. కమిటీ మళ్లీ ఈవేళ సాయంత్రం సమావేశమై తీర్మానాలకు తుదిరూపం యిస్తుంది. ఆ తరువాత దానిని బహిరంగ సమావేశ చర్చకు పెట్టబడుతుంది.

అఖిలభారత హిందూ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ యన్. బి. ఖరే చర్చను ప్రారంభిస్తూ నైజాం నవాబును తొలగించి హైద్రాబాద్ సంస్థానాన్ని భాషాప్రయుక్తంగా విభజించాలని సభవారు డిమాండ్ చేయాలని కోరారు. భారత రాజ్యాంగా ననుసరించి ఒక సరిహద్దు కమీషన్‌ను కూడా నియమించాలని కోరాలన్నారు. "భాషా ప్రయుక్త రాష్ట్రాలను డిమాండ్ చేసే వారు కాక భాషారాష్ట్రాల నిర్మాణానికి అడ్డుపడుతున్నవారే" విచ్ఛిన్నకరులని మహాసభ స్పష్టం చేయాలని డాక్టర్ ఖరే కోరారు.

స్టేట్ కౌన్సిల్ సభ్యుడు శ్రీ రామారావు దేశముఖ్ మాట్లాడుతూ భాషారాష్ట్రాల నిర్మాణానికి అవసరమైన వివరాలలోకి వెళ్లేందుకు ఒక శాశ్వత సంస్థను ఈమహాసభఏర్పరచాలన్నారు. ఆంధ్రరాష్ట్రం నిర్మాణం త్వరలోనే జరిగే అవకాశాలు అధికంగావున్నాయి గాబట్టి ఈమహాసభ దానిని గురించే ముందు వత్తిడి చేయాలన్నారు. "ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమే జరిగితే తతిమ్మావి దానివెంటే జరిగితీరతాయి. ఇంకా భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి అడ్డుపెట్టడం ఎవ్వరికితరమూ కాదు." అని ఆయన అన్నారు.

మరికొంతమంది ప్రతినిధులు పార్టీ ప్రాతిపదికలేని ఒక అఖిలభారత భాషా రాష్ట్రాల సంస్థను [illegible] భాషా ప్రయుక్త రాష్ట్ర [illegible] దేశంలోని వివిధ [illegible] జరుగుతున్న ఉద్యమా[illegible] పరుస్తూ నడిపించాలని కోరారు.

శ్రీ బి. యస్. ముఖర్జీ తదితర కమ్యూనిస్టు ప్రతినిధులు విశాల ప్రాతిపదికపై మరొక అఖిలభారత మహాసభ జరగాలనీ, దానిని జరిపించడానికి యీ మహాసభలో ఒక సన్నాహక కమిటీ ఏర్పరచాలని కోరారు. ఈ సన్నాహక కమిటీ అన్ని రాష్ట్రాల్లో భాషారాష్ట్రాల మహాసభలను జరిపించడానికి కృషి చేయాలనీ సూచించారు.

మద్రాసు శాంతి సమావేశం కరంజియా రాక

మద్రాసు, ఆగష్టు 16

మద్రాసులో ఆగష్టు 31 న జరగనున్న శాంతి సమావేశంలో పాల్గొనడానికిగాను బ్లిట్జ్ పత్రిక సంపాదకుడు శ్రీ ఆర్. కె. కరంజియా ఆగష్టు 30 న మద్రాసు వస్తున్నారు. ఎ. కె. గోపాలన్, జె. సి. కుమరప్పగార్లుకూడ యీ సమావేశంలో పాల్గొనటానికి అంగీకరించారు. పై శాంతిసమావేశంలో పెకింగులో జరగనున్న ఆసియా శాంతి మహాసభకు వెళ్ళే ప్రతినిధులు ఎన్నుకోబడతారు. (మా. వి.)

కాశ్మీర్ ఇండియాలో చేరడానికి కారణం

షేక్ అబ్దుల్లా వివరణ

శ్రీనగర్, ఆగష్టు : 16

పాకిస్తాన్‌లోకంటె ఇండియాలోనే తమ ఆశలు, ఆశయాలు నెరవేరతాయి గాబట్టి కాశ్మీర్ ప్రజలు ఇండియా వైపుకు మొగ్గారని నిన్న స్వాతంత్ర్య దినోత్సవసందర్భంలో పెద్ద బహిరంగ సభలో మాట్లాడుతూ కాశ్మీరు ప్రధాని షేక్ అబ్దుల్లా అన్నారు.

కాశ్మీర్ ప్రధాని తన ప్రసంగంలో యింకా ఇలా అన్నారు:

"గతాన్ని మరచి యువరాజు కరణ్‌సింగ్‌ను మొదటి రాజ్యాధిపతిగా ఎన్నుకొంటామని తెలిపాం. చిత్తశుద్ధితో మేము చేసిన ఈ సూచనను ఆయన నిరాకరించదలిస్తే మేము చేసేదేమీ లేదు. ఆ పరిస్థితులలో మా రాజ్యాం యధాతథంగా కొనసాగిస్తాం."

జెనీవాలో జరుగబోయే కాశ్మీర్ వ్యవహారాలను గురించి వచ్చేవారం ఢిల్లీలో సంప్రదింపులు జరుగుతాయని కాశ్మీర్ ప్రధాని తెలిపారు.